# ధర్మఘంటి

జాతీయ తెలుగు దినపత్రిక

TELTEL/2012/47103

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 141 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం, 21 ఆగస్టు 2025 | పేజీలు : 8 | వెల : 1

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


## లాభాల బాటలో దేశీయ సూచీలు

గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్త నెమ్మదించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు

## భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం ఉండదు

భారత దీర్ఘకాలిక వృద్ధిపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉండకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్, అభిప్రాయపడింది. ఆర్థిక సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుండటం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. 'విదేశీ వాణిజ్యంపై భారత ఆర్థిక వ్యవస్థ పరిమితంగానే ఆధారపడుతోంది. జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా కేవలం 15 శాతమే కాగా... దేశీయ గిరాకీనే 85 శాతం వరకు ప్రభావం చూపుతోంది.

# మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్

- భారీగా పెరిగిన దరఖాస్తు ఫీజు..!
- రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం దుకాణాలకు గానూ లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ
- ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్సుల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది
- డిసెంబర్ 1వ తేదీ నుంచి మద్యం దుకాణాల ఏర్పాటు కావల్సి ఉంది.
- అప్లికేషన్ రుసుము 3 లక్షల రూపాయలు నాన్ రిఫండబుల్‌గా నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాల వారీగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో వైన్స్ షాపు టెండర్లకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం దుకాణాలకు గానూ లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న మద్యం దుకాణాల లైసెన్సుల గడువు నవంబర్ 30వ తేదీతో ముగియనుంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి మద్యం దుకాణాల ఏర్పాటు కావల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే కొత్త లైసెన్సులను లాటరీ ద్వారా ఎంపిక చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. అప్లికేషన్ రుసుము 3 లక్షల రూపాయలు నాన్ రిఫండబుల్‌గా నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జిల్లాల వారీగా ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. 2025-2027 సంవత్సరానికి వైన్స్ షాప్ టెండర్ల కు నోటిఫికేషన్ విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం.. ఈసారి లైసెన్స్ దరఖాస్తు ఫీజును అమాంతం పెంచేసింది. గతంలో రూ. 2 లక్షలు ఉన్న దరఖాస్తు - మిగతా3లో



## లోక్‌సభ ముందుకు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు

- కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్
- ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లు
- నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా



## నేను అరెస్టయితే పదవికి రాజీనామా చేశా

- 30 రోజులు జైల్లో ఉంటే పదవి రద్దుపై అమిత్‌షా
- క్రిమినల్ కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లే ప్రజాప్రతినిధుల పదవులకు చెక్ పెట్టేలా బిల్లు
- కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లుపై ప్రతిపక్షాల వ్యతిరేకత



## లోక్‌సభ ముందుకు కీలక బిల్లు.. శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ

- కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపై కూడా ఆయన పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా వ్యాఖ్యలు
- 'ఇది ఇంగిత జ్ఞానానికి సంబంధించిన విషయం
- ఇందులో నాకు ఎలాంటి తప్పు కన్పించడం లేదు



## కాళేశ్వరం కమిషన్‌పై 21న తెలంగాణ హైకోర్టులో విచారణ

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై తెలంగాణ హైకోర్టులో గురువారం విచారణ జరగనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలపై న్యాయ విచారణకు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న ప్రభుత్వం జారీ చేసిన జీవో 6ను కూడా అందులో సవాలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, జస్టిస్ ఘోష్ కమిషన్‌ను పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నాటి భారత రాష్ట్ర సమితి - మిగతా3లో

## ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి!

'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడి

## రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకే ఆ బిల్లు

- ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్‌షా రాష్ట్రాలను అస్థిర పర్చేందుకు సరికొత్త పన్నాగాలు పన్నుతున్నారు
- "ఓట్ల దొంగతనం బయటపడిన నాటినుంచి మోదీ-షా సరికొత్త ట్రిక్కుల కోసం చూస్తున్నారు
- నేడు తీసుకొస్తున్న తాజా బిల్లు రాష్ట్ర ప్రభుత్వాలను నేరుగా కూల్చే అవకాశం సీబీఐ, ఈడీకి అప్పజెబుతుంది
- తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు



## 1971 నుంచి అదే దుర్మార్గపు ధోరణి

- ఐరాస వేదికగా పాకిస్థాన్‌పై భారత్ ఫైర్
- మహిళలపై లైంగిక హింస విషయంలో పాకిస్థాన్ సిగ్గుమాలిన రికార్డును కలిగి ఉంది
- అలాంటి దేశం మానవ హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది
- '1971లో తూర్పు పాకిస్థాన్‌లో పాక్ సైన్యం మహిళలపై జరిపిన ఘోరమైన లైంగిక నేరాలు చరిత్రలో ఒక సిగ్గుచేటు అయిన రికార్డు






## మేడారం జాతర.. తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- మేడారంలో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు
- వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మేడారం మహా జాతర ఎన్నడూ లేని రీతిలో వైభవోపేతంగా జరగనుందని అధికారులు వెల్లడి



## ప్లానింగ్ లేదు.. సమీక్ష లేదు..

- రైతులను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే
- ఎన్నడూ కాంగ్రెస్‌ది సానుకూలమైన చరిత్ర కాదు..
- కాంగ్రెస్ ప్రభుత్వం రాంగనే పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎందుకు వచ్చింది ?
- నాయకుడికే వ్యవాసయంపై అవగాహన లేదు
- సిగ్గులేని మాటలు మాట్లాడుతుంది..
- రైతుపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు..
- 51సార్లు ఢిల్లీకి వెళ్లినా 51 బస్తాలు మంజూరు చేయలే..
- ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ వెనుక కాంగ్రెస్ వాళ్లే ఉన్నారని అనుమానాలున్నయ్ : కేటీఆర్

## దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ


- అప్పుడు హైటెక్ సిటీపై అవహేళన..
- ఇప్పుడు మూసి ప్రక్షాళనపై విమర్శలు: రేవంత్ రెడ్డి
- రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చాం
- రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం
- ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు.
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్

రాజీవ్ గాంధీ వల్లే ఐటీ రంగంలో చాలా మంది రాణిస్తు న్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైదరాబాద్ అభివృద్ధిలో ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలుగా వ్యవహరించిన చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్ర ఉందని వెల్లడించారు. 1994 నుంచి 2014 వరకు హైదరాబాద్‌ను అప్పటి సీఎంలు అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. గూగుల్‌లాంటి ప్రముఖ సంస్థల్లో తెలుగువారు పెద్ద పదవుల్లో ఉన్నారని తెలిపారు. మన ప్రాంత విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని పలు సంస్థలు నిర్మించారని గుర్తు చేశారు. గచ్చిబౌలిలో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. "హైటెక్ సిటీ కట్టినప్పుడు అవహేళన చేశారు. - మిగతా3లో

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు



## సంపాదకీయం

# నామమాత్రమైన సంక్షేమ చట్టాలు

కన్నవారు, తాము పెంచి పెద్ద చేసిన తమ వారు, బంధు బాంధవులు, కడదాక తమకు వెన్నంటి ఉంటారని అనుకుని, అశక్తత ఆవహించిన ముదిమి వయసులో, అందరూ వదిలి వేస్తుండగా, ఒంటరితనం భరించడం భయంకరమైన వేళ... విధి వంచితులైన ఎందరో వయోవృద్ధులు, పడుతున్న బాధలు వర్ణనాతీతం. వయో వృద్ధుల సంక్షేమార్థం చేసిన చట్టాలు, వాటి అమలుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, కాగితాలకే పరిమితమై, ఆచరణకు నోచుకోలేక మృగ్యాలే అవుతున్నాయి. భారత దేశంలో ప్రస్తుతము 15కోట్లమంది వృద్ధులున్నారు. 2050 నాటికి వీరి సంఖ్య 32.3కోట్లకు చేరుతుందని అంచనా. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వృద్ధుల సంఖ్య అప్పటికి రెండున్నర కోట్లు దాటే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో 40 లక్షల మంది వయోవృద్ధులు ఉండగా, వీరిలో 10 శాతంకు మించకుండా ఆర్థికంగా, ఆరోగ్యంగా, తమ తమ పిల్లల, బంధువుల వద్ద ఉంటుండగా, మరికొందరు తమ పిల్లలే చేర్పించిన అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలలో తమ దుస్థితిని తామే తిట్టు కుంటూ, కాలం వెళ్లదీస్తున్నారు. ఆకలితో అలమటిస్తూ, అనారోగ్యాలకు బలి అవుతూ, నిరాదరణ నీడలో మగ్గుతూ, ఎందరో తమ దుస్థితికి ఆవేదన చెందుతుండటం హృదయ విదారకమై, గుండెలను పిండి వేస్తున్న సచిత్రం సర్వత్రా సాక్షాత్కార మిస్తున్నది. దేశంలో నెలకొన్న వరిస్థితుల వల్ల సామాన్యులకు నానాటికీ బతుకు భారము అవుతున్న రోజులివి. అదేక్రమములో వృద్ధుల పట్ల నిరాదరణ కూడా అంతకంతకు ఎక్కువై పోతోంది. దేశాన్ని పాలిస్తోంది ప్రధానంగా వృద్ధనేతలే అయినప్పటికీ వయోవృద్ధుల సమస్యలకు వరిష్కారం కనబడక పోవడము అసలైన విషాదం. దేశంలోని ప్రతి అయిదుగురి వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేదింపులకు గురవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధాప్యంలో కుటుంబ సభ్యులే వృద్ధుల పాలిట శత్రువులుగా మారుతున్నారు. దూషణలకు పాల్పడటమే కాకుండా కొందరు శారీరక హింసకూ పాల్పడు తుండటం పతనమవుతున్న మానవతా విలువలకు నిదర్శనం. వాస్తవానికి వృద్ధులు జాతి సంపద! వారి అనుభవాలు ముందు తరాలకు అమూల్యమైన పాఠాలు. అందుకే పాశ్చాత్య దేశాలు వృద్ధుల సంరక్షణకు దీటైన చట్టాలు రూపొందించాయి. బతికినంత కాలం వృద్ధులను కుటుంబ సభ్యులు ఆదరణతో చూసుకునే విధంగా పటిష్ఠ నిబంధనలు చట్టంలో పొందు పరచారు. అనేక దేశాలు చట్టాలు చేసిన 50 ఏళ్ళ తర్వాత, "తల్లిదండ్రుల, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007" మన దేశంలో రూపొదించ బడ్డది. ఐతే దీని గురించి ఎలాంటి అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం, సదరు చట్టంపై చాలా మందికి అవగాహన లేకపోవడం, సర్వత్రా కనిపిస్తున్నది. ఫలితంగా ఆ చట్టం నిరుపయోగం అవుతున్నది. సంరక్షణ, భద్రత కల్పించాల్సిన వయోవృద్ధులను, సీనియర్ సిటిజన్లను కుమారులు, కూతురులు విడిచిపెట్టి, పరిత్యాగం చేసే విధంగా, బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా, చట్ట ప్రకారం శిక్షార్హమే. శిక్షాకాలం ఒక టర్మ్‌కు, మూడు మాసాల జైలు శిక్ష లేదా అపరాధ రుసుము, గరిష్ఠంగా ఐదు వేల రూపాయలు, రెండింటిని విధించవచ్చు. జిల్లాస్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ కు జిల్లా కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్. డి. ఓ. నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు ఒక వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, సీనియర్ సిటిజన్లకు వేరుగా క్యూ పద్ధతి ప్రవేశపెట్టాలని, దీర్ఘకాలిక, అంతిమ పునర్వికాసం లేని రోగాల చికిత్సల సదుపాయాలు, ప్రభుత్వమే కల్పించాలని, 2007 సంక్షేమ చట్టం నిర్దేశిస్తున్నా, అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం జారీచేసిన వృద్ధుల సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టం పై, సదవగాహన కల్పించడానికి సదస్సులు ఏర్పాటు, ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమం, సీనియర్ సిటిజన్ "డే కేర్" సెంటర్ల నిర్వహణ, ప్రతి మండలంలో వీరి రక్షణ, వైద్య సహాయం కోసం వైద్యశాల, బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా మరిచింది. వయోవృద్ధుల సంక్షేమానికి ఒక డైరెక్టరేటును ఏర్పరచి తగిన నిధులను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. జిల్లాలలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ లను నెలకొల్పాలి. తల్లిదండ్రుల, వృద్ధుల పోషణ మరియు సంక్షేమ నియమావళి చట్టం 2011 నిబంధనల మేరకు, జిల్లా కేంద్రాలలో అప్పిలేట్ ట్రిబ్యునళ్ళు, డివిజన్ కేంద్రాలలో ట్రిబ్యునళ్ళు ఏర్పాటు చేసి బాధితుల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించాలి. ఇతర రాష్ట్రాలలో రవాణా సంస్థల బస్సులలో, 30 శాతం రాయితీ ఉండగా, తెలంగాణలో ఇప్పటివరకు లేదు. ఇంటి పన్నులో 30% రాయితీ ఆదాయపు పన్ను పూర్తిగా మినహాయింపు ఇవ్వాలి. కళ్ళజోళ్ళు, వినికిడి తదితర పరికరాలు, వీల్ చైర్స్, వాకింగ్ సాధనాలు అందించాలి. వీరి రక్షణ చర్యలు గైకొనాలి. దేవాలయాలలో ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించాలి.

# వృద్ధులను జాతి సంపదగా గుర్తించాలి



బాల్య, కౌమార్య, యవ్వన, వృద్ధాప్యాలు జీవితంలో ఏ ప్రాణికయినా తప్పనిసరిగా సంభవించే జీవన రేఖలు. 'ఎండుటాకును చూసి పచ్చటాకు నవ్వింది' అని తెలుగులో ఒక సామెత ఉంది. పండిపోయి చెట్టు నుంచి రాలే ఎండుటాకును చూసి చెట్టు రెమ్మలకు వేలాడే పచ్చటాకు నవ్విందట. అది గమనించిన ఎండుటాకు పిచ్చిమొహమా రేపు నీకు కూడా నా గతే కదే.. అని పకపకమంటూ ఆ ఎండుటాకు రాలిపోయిందట. మనిషి జీవిత చక్రంలో వచ్చే మార్పులు బాల్యం, యవ్వనం, వృద్ధాప్యం. అయితే మనిషిగా పుట్టిన ప్రతివ్యక్తీ తుదిశ్వాస ఉన్నంతవరకు, ప్రతి దశలోనూ ఎంతో ఆనందంగా జీవించాలని కోరుకుంటాడు. వృద్ధాప్యము లేదా ముసలితనము మానవ జన్మలో చివరి దశ. దీనిని నిర్వచించడానికి వయోపరిమితి లేనప్పటికి, మనిషి శరీరము రోగనిరోధక శక్తిని క్రమక్రమముగా కోల్పోయి చివరకు మరణించే స్థితికి చేరే దశను వృద్ధాప్యముగా చెప్పవచ్చు. నేడు పిల్లలుగా, యువజనులుగా, నడివయస్కులుగా పాత్రలు పోషిస్తున్న అందరూ వృద్ధుల బృందంలోకి అడుగు పెట్టే పరిస్థితి తప్పక వస్తుంది. యవ్వన దశలో వారు సమాజానికి అవసరమైన సమస్త ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొని రేపటి తరాల ఉజ్వల భవిష్యత్తుకు తమ వంతు కృషి చేసి ఉంటారు. పనులు మాని, లక్ష్యాలు పూర్తి చేసుకుని ఉత్పత్తికి దూరమై విశ్రాంతి తీసుకుంటూ జీవన చరమదశను ముగిద్దామని దీర్ఘ సెలవులో ఉన్న జాతి నిర్మాతలే వృద్ధులు. అందుకే వారికీ ఓ రోజును కేటాయించి సమాజానికి వారు అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఆగష్టు 21న అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ డే జరుపు కుంటున్నారు. ఐక్య రాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఇప్పుడు 60 ఏళ్ల వయసును కలిగి ఉన్నారు. 2050 నాటికి ప్రపంచంలోని ప్రతి అయిదుమందిలో ఒకరు 60 ఏళ్లు ఆ పైబడి వయసు కలిగి ఉంటారట. 2150వ సంవత్సరానికి ప్రపంచంలో ప్రతి ముగ్గురు వ్యక్తుల్లో ఒకరు ముదుసలిగా ఉంటారట. సీనియర్ సిటిజన్లుగా పేరు పడిన ఈ వయోవృద్ధుల అవసరాలు తీర్చే కృషిలో వ్యక్తులూ, సమాజమూ పునరంకితం అయేందుకు గాను ప్రపంచం వ్యాప్తంగా అన్ని దేశాలూ అంతర్జాతీయ వృద్ధాప్య దినాన్ని జరుపు తున్నాయి. తన కుమారులకు, కుమార్తెలకు, మనుమళ్ళకు, ముని మనుమలకు సలహాలు ఇచ్చే వయస్సు కూడా ఇదే. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం కూడా వృద్ధుల సంక్షేమానికి కొన్ని జాతీయ ప్రణాళికను, కొన్ని మార్గదర్శకాలను ప్రకటించింది. అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా గత 2007లో వృద్ధుల కోసం పోషణ, సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే, ఈ చట్టాలు అమలుకు పూర్తిగా అమలుకు నోచుకోవడం లేదన్నది తెలిసిన సత్యమే. వృద్ధుల సమస్యల పరిష్కారానికి సమాజంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలి. వేధింపులు, ఆరోగ్య సమస్యల నుంచి వృద్ధులను దూరంగా ఉంచేలా కుటుంబ సభ్యులంతా చొరవ చూపాలి. జీవితంలో వృద్ధాప్యం అనేది చివరి దశ కావడంతో- వారిలో శారీరక మార్పులను ఆపడం ఎవరితరం కాదు. వృద్ధాప్యం అన్నది శరీరానికే కానీ మనసుకు కాదని ప్రతివారూ తెలుసు కోవాలి. ప్రస్తుతం అరవయ్యేళ్ల వయసు దాటిన వారు దేశంలో 15 కోట్ల మేరకు ఉంటారని అంచనా. వీరిలో సుమారు కోటిన్నర మందికి పైగా ఒంటరి జీవితం సాగిస్తున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలు, ఔషధాలు అందుబాటు లోకి రావడంతో ఆయుర్దాయం పెరుగుతోంది. దీంతో వృద్ధుల సంఖ్య అదే స్థాయిలో అధిక మవుతోంది. ప్రపంచంలో ఎక్కువ మంది వృద్ధులు ఉన్న దేశంగా చైనా మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ 60 ఏళ్లకు పైబడినవారు 16.7 కోట్ల మంది, 80 ఏళ్లకు పైబడిన వారు పది లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లకు పైబడిన వారి 'సూపర్ సీనియర్ సిటిజన్స్' అంటారు. జపాన్‌లో నూటికి 30 శాతం మంది 60 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు. 2050 నాటికి 64 దేశాలు 30 శాతం వృద్ధులతో నిండి పోతాయట! అంటే వృద్ధుల జనాభా 120 కోట్లకు చేరుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 80 శాతం వృద్ధులుంటారని ఐక్యరాజ్యసమితి చెబుతోంది. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా 30 కోట్లపైనే ఉండే అవకాశముంది. మన దేశంలో ప్రతి ఐదుగురు వృద్ధుల్లో ఒకరు ఒంటరిగా జీవిస్తున్నారు. ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురి అవుతున్నారు. 'హెల్పేజ్ ఇండియా' అధ్యయనం నిగ్గుతేల్చిన విషయమిది. వృద్ధుల సంరక్షణ వారి పిల్లల కనీస బాధ్యత. వయసుడిగిన దశలో తమ వారసుల నుంచి వారు కోరుకునేది ప్రేమ పూర్వక పలకరింపు, ఆదరణ, అభిమానాలే తప్ప- ఆడంబరాలు, విలాసాలు కాదు. వృద్ధాప్యంలో ఆరోగ్య సమస్యలే కాదు, ఆర్థిక, సామాజిక సమస్యలు వారిని చుట్టు ముడుతాయి. ఇలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సి ఉండాలి. 60 ఏళ్లు పైబడిన అనుభవజ్ఞుల శక్తిని, అనుభవ సారాన్ని ఉపయోగం చేసుకుంటే తప్పకుండా ఏ దేశమైనా పురోగమిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారే కాదు, సంపన్న కుటుంబాల లోనూ వృద్ధులైన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించి తమ పని పూర్తయిందను కుంటున్నారు. రేపు తమదీ ఇదే బతుకని వారు మరచి పోతున్నారు. సంతానం ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా పిల్లలు కళ్లముందున్నప్పటికీ కొందరు వృద్ధులు అనాథలుగా మారుతున్నారు. ఆవేదనతో మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. సంపాదన అనే వ్యామోహంలో పడి కొందరు యువకులు తల్లిదండ్రుల ప్రేమను పోగొట్టు కుంటున్నారు. మరికొంత మంది బంధాలను దూరం చేసు కుంటున్నారు. జాతీయ స్థాయిలో వృద్ధుల స్థితిగతులపై 'హెల్పేజ్ ఇండియా' వెలువరించిన నివేదికలో అనేక ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. సొంత కుటుంబ సభ్యులనుంచే నిరాదరణ ఎదురవుతోందంటూ 56 శాతం వృద్ధులు స్పందించారు. కుమారుల్లో 57 శాతం, కోడళ్లలో 38 శాతం పెద్దవారిని ఆదరించడం లేదట. తమ హక్కుల సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై వృద్ధుల్లో కొంతవరకు అవగాహన ఉన్నప్పటికీ, కుటుంబ గౌరవం మంట గలుస్తుందన్న భయంతో పోలీసులను ఆశ్రయించటం లేదన్నది 52 శాతం వృద్ధుల స్పందన. వృద్ధులపై వేధింపుల నిరోధానికి కేంద్రం ఒక చట్టం చేసింది. 'తల్లిదండ్రులు, వృద్ధుల సంక్షేమ నిర్వహణ చట్టం'గా వ్యవహరించే దీని గురించి చాలామంది వృద్ధులకు తెలియదు. గ్రామీణ వృద్ధుల్లో 45 శాతం మంది దీర్ఘకాల అనారోగ్యాలతో బాధపడుతున్నారని జాతీయ నమూనా సర్వే తెలిపింది. ఇంట్లో ఎన్ని బాధలు పడుతున్నా నోరువిప్పని వృద్ధులు ఢిల్లీలో 92 శాతం వరకు ఉంటారని హెల్ప్ ఏజ్ ఇండియా అధ్యయనం తెలిపింది. నేటి ఆధునిక కాలంలో వృద్ధాశ్రమాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటుకావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వృద్ధులు ప్రశాంతంగా కాలం గడపడానికి అవసరమైన చేయూత అందచేయడం కుటుంబ సభ్యులందరి కనీస బాధ్యత. వృద్ధాప్యంలో ఉన్నవారితో ప్రతిరోజూ కాసేపైనా గడపాలి. వారి అనుభవాల్ని తెలుసుకోవాలి. ఈరోజు మనం వృద్ధులకు ప్రేమను పంచితే- రేపు మన వృద్ధాప్యంలో మనం కూడా ప్రేమను పొంద గలుగుతాం అని యువత గుర్తించాలి. వృద్ధులను మన జాతి సంపదగా గుర్తించాలి. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినా, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం అవుతున్నందున వయోధికులకు ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు పూర్వ వైభవం వచ్చినపుడే వృద్ధులకు గౌరవం పెరుగుతుంది. అన్నింటికన్నా కుటుంబ సభ్యుల ఆదరణే వారికి కొండంత అండ అన్న సంగతిని విస్మరించరాదు.

# ఉద్దిష్టమైనది మాస శివరాత్రి



మాస శివ రాత్రి. ప్రతి నెలా వచ్చే మన శివుని పండుగ. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా కృష్ణ పక్షం చతుర్దశి నాడు ఆ భోళా శంకరుని ఉద్దేశించి చేసుకునే పూజ. ఈ రోజున ఉపవాసం, ప్రదక్షిణాలు ప్రత్యేకముగా, విశిష్టముగా ఉంటాయి. చంద్రమా మనసో జాతః అని పెద్దలు చెపుతూ ఉంటారు. అంటే చంద్రుడు మన మనస్సుకు కారకుడు. చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడు కేతువు ప్రభావము ఎక్కువగా ఉంటుంది. అందుకే ఆ చంద్రుడిని తల పైన పెట్టుకున్న చంద్రశేఖరుని శరణు వేడడం సదాచారం. ఓం నమఃశ్శివాయ అనే పంచాక్షరీ మహామంత్రం యజుర్వేదం రుద్రాధ్యాయం లోనిది. 'న, మ, శి, వ, య. మంత్రం' 'ఓం' కారంతో ప్రారంభం అవుతుంది. ఓం... మహాబీజాక్షరం. 'న' అనేది భగవంతునిలోని కాంతిని తెలియ చేస్తున్న ఈ పంచాక్షరాలను పంచభూతాలు అని కూడా అంటారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు నిర్వచనం చెప్పారు. ఈ మంత్రోచ్చారణ పంచ భూతాల సంబంధంగా చెపుతారు. న అంటే భూమి, మ అంటే నీరు, శి అంటే నిప్పు, వ అంటే గాలి, య అంటే ఆకాశం అని ఈ మంత్రంలో ఉన్న అక్షరాలకు వివరణ ఇచ్చారు. మానవ శరీరం పంచభూతాత్మకం. నమశ్శివాయ అనే అయిదు అక్షరాలను పలికినప్పుడు పంచ భూతాలతో నిండిన శరీరం శుభ్రమవుతుంది. ఒక్కో అక్షరం ఒక్కో భూతాన్ని శుభ్రం చేస్తుంది. 'న' భూమికి సంబంధించిన భాగాలను, 'మ' నీటికి సంబంధించిన భాగాలను, 'శి' అగ్నికి సంబంధించిన భాగాలను, 'వ' గాలికి సంబంధించిన భాగాలను, 'య' ఆకాశానికి సంబంధించిన భాగాలను పరిశుభ్రం చేస్తాయి. భోళా శంకరుడు అభిషేక ప్రియుడు నాలుగు చుక్కల నీరు పోసి, మూడు దళాలు ఉన్న బిల్వ దళం మనసారా పెడితే సంతోషించి వరాలనిచ్చే వరదుడు. శివభక్తుడైన సౌనంద గణేశ ముని ఒకసారి యమ లోకానికి వెళ్లగా యమధర్మరాజు ఆయనను సత్కరించి, వచ్చిన కారణమేమిటని అడిగాడు. తాను యమలోకంలోని విశేషాలను చూడడానికి వచ్చినట్లు ముని చెప్పారు. దీంతో తన లోకంలో నరక యాతనలు అనుభవిస్తున్న పాపాత్ములను యముడు ఆ మునికి చూపించాడు. వారి పరిస్థితికి జాలిపడిన ఆ మహర్షి.. ఓ జనులారా! ఇది 'ఓం నమశ్శివాయ' అనే మంత్రం దీనిని ఉచ్చరిస్తే మీ యాతనలు పటాపంచలవుతాయని తెలిపారు. ముని చెప్పగా వారంతా పంచాక్షరిని జపించారు. దీంతో వారికి నరక విముక్తి లభించి, అంతా కైలాసం చేరుకున్నారట. అధికార గర్వముతో దుర్వాస మహర్షిని అవమానించిన దేవేంద్రుడు ఆ మహానుభావుని శాప కారణంగా తన సమస్త సంపదలు సముద్రం పాలు అవ్వడం చూస్తూ ఉండి పోయాడు. మందర పర్వతమును కవ్వముగా, వాసుకిని తాడుగా చేసుకుని క్షీర సాగరమును మధించినప్పుడు ముందుగా లోకాలన్నిటినీ భస్మం చేస్తుందా అని అనిపించేలా ఉగ్రతతో హాలాహలం పుట్టింది. అమ్మవారి అనుమతి తీసుకుని ఆ లోకాధారుడు ఆ కాలకూట విషయాన్ని తాను స్వీకరించి లోకాలను కాపాడాడు. క్షీరసాగర మధనం మరలా కొనసాగేలా చూసాడు. తన లోపల ఉన్న లోకాలకు కష్టం కలగకుండా గొంతులోనే నిలుపుకుని శ్రీకంఠుడు, గరళకంఠుడు, నీలకంఠుడు అయ్యాడు. శివుడికి ఈ రోజును ప్రీతి పాత్రమైన రోజున శివుడికి అభిషేకాలు, పూజలు చేయడం వలన కోరిన కోర్కెలు నెరవేరుతాయి అని ప్రతీతి. శివరాత్రి అనగా శివుని జన్మదినం (లింగోద్భవం) అని అర్థం. శివుని జన్మ తిథిని అనుసరించి ప్రతి నెలా జరుపుకునేదే మాస శివరాత్రి. మహాశివుడు లయ కారకుడు. లయానికి (మృత్యువునకు) కారకుడు కేతువు. అమావాస్యకు ముందు వచ్చే చతుర్దశి సమయంలో చంద్రుడు క్షీణించి ఉంటాడు. చంద్రమా మనసో జాతః అనే సిద్ధాంతము ప్రకారము చంద్రుడు క్షీణ దశలో ఉన్నప్పుడూ జీవులపై ఈ కేతు ప్రభావము ఉండటము వలన వారి వారి ఆహారపు అలవాట్లపై ప్రభావము చూపడం వలన జీర్ణశక్తి మందగిస్తుంది. తద్వారా మనస్సు ప్రభావిత మవుతుంది. మాస శివరాత్రి నాడు ఉపవాసము ఉండి, వీలైతే శివాలయ దర్శనం చేసుకొని, శక్తి మేర 3, 5, 11, 18, 21, 54, 108 ఇలా ప్రదక్షిణలు చేయవచ్చు. అదేవిధంగా ఆరోజు ప్రదోష వేళ శివునకు మారేడు దళములతో లేదా కనీసము గంగా జలముతో అభిషేకాది అర్చనలు చేయడము మంచిది. ఇవేమీ చేయడానికి అవకాశములేని వారు, ఆరోగ్యవంతులు, అలాగే గృహములో అశౌచ దోషము లేనివారు ఈ రోజు ఉపవాసము ఉండడం చేయాలి. శివనామ స్మరణ చేస్తూ సాయంకాలం ప్రదోష సమయంలో శివునికి అభిషేకం చేయాలి. అభిషేకానంతరం, బిల్వాష్టోత్తరం చెపుతూ బిల్వ దళాలను శివునికి అర్పించాలి. కనీసం ఉపవాసం ఉండి, సాయం కాలం శివాలయానికి వెళ్ళి దీపారాధన చేసి పంచాక్షరీ మంత్రమైన ఓం నమః శివాయను జపించడం కూడా మంచిది. పన్నెండు మాస శివరాత్రులలో ఏ శివరాత్రికైనా సత్కర్మలు చేయడం వల్ల సత్ఫలితాలు పొందుతారు.

# రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకే ఆ బిల్లు

**ఇంటర్నెట్‌డెస్క్:** ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను వాడి రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త బిల్లు తీసుకొస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు ఆరోపించారు. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సాకేత్ గోఖలే మాట్లాడుతూ ప్రధాని మోదీ, హెూం మంత్రి అమిత్‌షా రాష్ట్రాలను అస్థిర పర్చేందుకు సరికొత్త పన్నాగాలు పన్నుతున్నారన్నారు. ఈమేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ఓట్ల దొంగతనం బయటపడిన నాటినుంచి మోదీ-షా సరికొత్త ట్రిక్కుల కోసం చూస్తున్నారు. నేడు తీసుకొస్తున్న తాజా బిల్లు రాష్ట్ర ప్రభుత్వాలను నేరుగా కూల్చే అవకాశం సీబీఐ, ఈడీకి అప్పజెబుతుంది. కోర్టు తీర్పు వచ్చాకే ఓ వ్యక్తి నేరగాడిగా నిర్ధరణ అవుతుంది. అప్పటివరకు వారు నిందితులు మాత్రమే. కేవలం ఆరోపణల ఆధారంగానే మీరు ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించలేరు. కేంద్ర ఏజెన్సీలతో మోదీ-షా అరెస్టు చేయించినా వారు నేరస్థులు కాబోరు" అని పేర్కొన్నారు. అదే పార్టీకి చెందిన లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా ఎక్స్‌లో స్పందిస్తూ ఈ బిల్లు సమాఖ్య, న్యాయవ్యవస్థలను బైపాస్ చేసుకొని వెళుతోందన్నారు. "ప్రతిపక్షాల అనుమానాలు వాస్తవం అవుతున్నాయి. కేవలం 240 మంది ఎంపీలతోనే భాజపా రాజ్యాంగాన్ని మార్చేస్తోంది. కొత్త బిల్లు సమాఖ్య, న్యాయవ్యవస్థలను తప్పించుకొని వెళుతోంది. ఎన్నికైన ప్రతిపక్ష పార్టీల ముఖ్యమంత్రులను ఈడీ, సీబీఐతో కేంద్ర ప్రభుత్వం టార్గెట్ చేసుకోవచ్చు. వారిపై నేరం రుజువు కాకపోయినా.. పదవుల నుంచి తప్పించవచ్చు" అని మంగళవారం అర్ధరాత్రి చేసిన పోస్టులో పేర్కొన్నారు.



పార్టీ రాజ్యసభ నేత డెరెక్ ఒబ్రియాన్ కూడా ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. పార్లమెంట్ వ్యవస్థను అపహాస్యం చేసేలా మోదీ సర్కారు ప్రయత్నాలు చేస్తోందన్నారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్రపాలిత ప్రాంత ముఖ్యమంత్రినిబీ రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుందని వెల్లడించాయి. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## లోక్‌సభ ముందుకు కీలక బిల్లు..


# శశిథరూర్ కాంగ్రెస్ వ్యతిరేక బాణీ

**ఇంటర్నెట్‌డెస్క్:** గత కొంతకాలంగా కాంగ్రెస్ విధానాలతో విభేదిస్తున్నారు ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ తాజాగా తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సరికొత్త బిల్లుపై కూడా ఆయన పార్టీ అధిష్ఠానానికి భిన్నంగా వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లును ప్రతిపక్ష ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ ఈ బిల్లు క్రూరమైనద న్నారు. అన్యాయంగా ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమ న్నారు. అయితే, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించడాన్ని శశిథరూర్ తప్పుబట్టారు. 'ఇది ఇంగిత జ్ఞానానికి



సంబంధించిన విషయం. ఇందులో నాకు ఎలాంటి తప్పు కన్పించడం లేదు' అని ఓ వార్తా సంస్థతో పేర్కొన్నారు. ఈ బిల్లును మరింత అధ్యయనం చేసేందుకు సెలక్ట్ కమిటీకి పంపే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై థరూర్ మాట్లాడుతూ.. అది ఎంతో మంచి విషయమన్నారు. అది మన ప్రజాస్వామ్యానికి ఎంతో మేలు చేస్తుందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరుసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లు ప్రవేశపెట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెల రోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు.

## ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు



**న్యూఢిల్లీ:** రాబోయే ఉపరాష్ట్రపతి ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం మొదలయ్యింది. బుధవారం ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ తన నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ సెక్రటరీ జనరల్‌కు తన నామినేషన్ పత్రాలను అందించారు. ఈ నామినేషన్ పత్రాలపై ఎన్డీఏ నేతలంతా సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతుగా సంతకాలు చేశారు. సీపీ రాధాకృష్ణన్ మద్దతుగా 20 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. దీనికి ముందు ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఎన్డీఏ పక్ష నేతలు సమావేశమయ్యారు. కాగా ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు ప్రతిపక్షాలు మద్దతివ్వాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరారు. ఏకగ్రీవంగా ఆయనను ఎన్నుకునేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎన్డీయే ఎంపీల సమావేశం జరగగా, ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను ప్రధాని స్వయంగా ఎంపీలకు పరిచయం చేశారు. అనంతరం ఆయనను సన్మానించారు.

## 1971 నుంచి అదే దుర్మార్గపు ధోరణి



భారత్ ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా దాయాది పాకిస్థాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. మహిళలపై లైంగిక హింస విషయంలో పాకిస్థాన్ సిగ్గుమాలిన రికార్డును కలిగి ఉందని, అలాంటి దేశం మానవ హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఘాటుగా విమర్శించింది. ఇరుదేశాల నడుమ సంఘర్షణ ప్రాంతాల్లో లైంగిక హింస బాధితులకు సహాయంపై జరిగిన చర్చలో పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ అనవసరంగా కశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంతో భారత్ ధీటుగా బదులిచ్చింది. భారత శాశ్వత ప్రతినిధి బృందం తరపున ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ మాట్లాడుతూ.. 1971 బంగ్లాదేశ్ విమోచన యుద్ధ సమయంలో పాకిస్థాన్ సైన్యం మహిళలపై జరిపిన అఘాయిత్యాలను గుర్తుచేశారు. '1971లో తూర్పు పాకిస్థాన్‌లో పాక్ సైన్యం మహిళలపై జరిపిన ఘోరమైన లైంగిక నేరాలు చరిత్రలో ఒక సిగ్గుచేటు అయిన రికార్డు. దాదాపు నాలుగు లక్షల మంది మహిళలు వారి అరాచకాలకు బలయ్యారు' అని అన్నారు.

ఆనాటి దుర్మార్గపు ధోరణి నేటికీ పాకిస్థాన్‌లో శిక్షార్హమైన రీతిలో నిరాటంకంగా కొనసాగుతోందని ఎల్డోస్ ఆరోపించారు. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారే నేడు న్యాయం గురించి మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. వారి ద్వంద్వ నీతి, కపటత్వం స్పష్టంగా కనిపిస్తున్నాయని పున్నూస్ ఎద్దేవా చేశారు. పాకిస్థాన్‌లో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలు, బాలికలపై కిడ్నాప్‌లు, బలవంతపు మత మార్పిడులు, లైంగిక హింస, గృహ హింస వంటివి నిరంతరం జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఈ విషయాలను ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం నివేదికలే ధ్రువీకరిస్తున్నాయని ఎల్డోస్ చెప్పారు. బలూచిస్థాన్‌లో మహిళల హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో భాగంగా 'ఔరత్ మార్చ్'లో పాల్గొన్న వారిని సైతం బలవంతంగా మాయం చేయడం, చిత్రహింసలకు గురిచేయడం వంటి ఘటనలను ఐరాస నివేదికలు ప్రస్తావించాయని ఎల్డోస్ పున్నూస్ సభ దృష్టికి తెచ్చారు. మానవ హక్కులపై కబుర్లు చెప్పే పాకిస్థాన్ ముందుగా ఆ దేశంలో మహిళలు, మైనారిటీల భద్రతపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

# భారత్ విషయంలో అమెరికా తీరు అన్యాయం: రష్యా

**ఇంటర్నెట్‌డెస్క్:** తమ దేశం నుంచి చమురు కొనుగోలు అంశంలో భారత్‌పై అమెరికా వైఖరి అన్యాయంగా ఉందని రష్యా ఆరోపించింది. ఈమేరకు ఆ దేశ దౌత్యవేత్త రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. భారత్-రష్యా మధ్య ఇంధన సహకారం భవిష్యత్తులోను కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం న్యూదిల్లీ సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. భారత్‌తో సంబంధాలపై పూర్తి విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థలను ఆ యుధంలా వాడుతోందని విమర్శించారు. వాస్తవానికి మిత్రుల ం ఎప్పుడూ ఆంక్షలు విధించరని వాషింగ్టన్‌ను దెప్పిపొడిచారు. రష్యా భవిష్యత్తులోను భారత్ అలాంటి చర్యలు తీసుకోదన్నారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బందిలేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటుచేసిందన్నారు. ప్రస్తుతం సగటున 5 శాతం డిస్కౌంట్‌తో భారత్ అవసరాల్లో 40శాతం సరఫరా చేస్తున్నామన్నారు. అమెరికా మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని చెప్పారు. భారత్ ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో అండగా ఉండటానికి తమ దేశం కట్టుబడి ఉందని రోమన్ వెల్లడించారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. భారత్‌లో ఉత్పత్తులు చేయడానికి న్యూదిల్లీకి సరైన భాగస్వామి రష్యానే అని పేర్కొన్నారు. గతంలో బ్రహ్మోస్ క్షిపణుల తయారీని గుర్తుచేశారు. శక్తిమంతమైన జెట్ ఇంజిన్ల తయారీపైనా పనిచేస్తున్నట్లు చెప్పారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన దేశమని.. అందుకే అధ్యక్షుడు పుతిన్ స్వల్ప వ్యవధిలోనే రెండుసార్లు ప్రధాని మోదీతో మాట్లాడారన్నారు. సమస్యల పరిష్కారంపై బీజింగ్-న్యూదిల్లీ కలిసి పని చేయడాన్ని స్వాగతించారు. చైనా మంత్రి వాంగ్‌యీ పర్యటన విజయవం తమైందన్నారు. ఇక రష్యాను శిక్షించేందుకు ఆంక్షలు విధించినవారే ఇప్పుడు ఆ ఫలితాలను అనుభవిస్తున్నారని రోమన్ చెప్పారు.

## లోక్‌సభ ముందుకు ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు



**దిల్లీ:** ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నేరంగా పరిగణించే కీలక బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్.. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025ను లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళన నడుమ ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. కాసేపటికే సభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ఆగడాలు ఇటీవల కాలంలో మరీ పెరిగిపోయిన నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్న వారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు. మరోవైపు ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్ కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాకు లేఖ రాసింది. గేమింగ్‌పై నిషేధం విధించే కంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

## 'నేను అరెస్టయితే పదవికి రాజీనామా చేశా'



న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా లోక్‌సభలో కీలక పరిణామం చోటు చేసుకుంది. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా లోక్‌సభలో 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల సవరణ బిల్లు, జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ ఈ మూడు కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం, ఆ బిల్లులను జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల ఆందోళనలతో లోక్‌సభ అట్టుడికి పోయింది. 30 రోజుల పాటు జైలు శిక్షను అనుభవించిన నేతల పదవులు రద్దయ్యేలా కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టిన బిల్లుపై ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఈ బిల్లుతో రాజకీయ దుర్వినియోగం జరిగే ప్రమాదం ఉందంటూ బిల్లు ప్రతుల్ని చించివేస్తూ ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 3గంటల వరకు వాయిదా వేశారు. వాయిదాకి ముందు తీవ్రమైన క్రిమినల్ కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లే ప్రజాప్రతినిధుల పదవులకు చెక్ పెట్టేలా హెూంమంత్రి అమిత్‌షా బిల్లును ప్రవేశ పెట్టారు. ఆ సమయంలో ప్రతిపక్ష ఎంపీలు బిల్లు ప్రతుల్ని చించి అమిత్‌షాపై విసిరేశారు. ఈ బిల్లు దేశ సమాఖ్య విధానానికి పూర్తి విరుద్ధం అంటూ నినాదాలు చేశారు. గుజరాత్ హెూంమంత్రిగా ఉన్నప్పుడు అమిత్‌షా అరెస్ట్ అయ్యారంటూ ప్రతిపక్ష ఎంపీలు చేసిన ఆరోపల్ని అమిత్‌షా ఖండించారు. 'అవును ..నన్ను తప్పుడు ఆరోపణలతో అరెస్ట్ చేశారు. నేను అరెస్ట్ అయినప్పుడు చేసినా నైతికంగా పదవికి రాజీనామా చేశాను' అంటూ ప్రతిపక్ష ఎంపీలను అమిత్‌షా వారించారు.

## ఎయిత్ స్టూడెంట్ చేతిలో టెన్త్ విద్యార్థి హతం..

## ప్రజాగ్రహంతో స్కూలు ధ్వంసం



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో దారుణం చోటుచేసుకుంది. ఏదో వివాదంలో ఎనిమిదో తరగతి.. విద్యార్థి పదో తరగతి విద్యార్థిని కత్తితో పొడవగా, బాధిత విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం బయటకు పొక్కినంతనే ప్రజాగ్రహం పెల్లుబికి పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. ఆగ్రహంతో రగిలిపోతూ కొందరు ఆందోళనకారులు పాఠశాలను ధ్వంసం చేశారు. మణినగర్ ఈస్ట్‌లోని సెవెంత్ డే అడ్వాంటేజ్ చర్చి స్కూల్‌లో ఎనిమిదవ తరగతి విద్యార్థి 10వ తరగతి విద్యార్థిని కత్తితో పొడిచాడు. చికిత్స పొందుతున్న సమయంలో ఆ విద్యార్థి మరణించాడు. అనంతరం బాధిత కుటుంబంతో పాటు సింధీ వర్గానికి చెందినవారంతా ఆందోళనకు దిగారు. పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించిన నిరసనకారులు పాఠశాల సిబ్బందిపై దాడి చేశారు. సమీపంలో పార్క్ చేసిన పాఠశాల బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడులతో పాఠశాల ఆస్తులకు భారీ నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులు పోలీసు వాహనంపై కూడా దాడి చేశారు. పాఠశాల వెలుపల రోడ్డును దిగ్బంధించారు. మణినగర్ ఎమ్మెల్యే, డీపీపీ బల్దేవ్ దేశాయ్, ఏసీపీ పరిస్థితిని చక్కదిద్దడాని ప్రయత్నించారు. బజరంగ్ దళ్, బీహెచ్‌పీ, అఖిల భారత విద్యార్థి పరిషత్ సభ్యులు 'జై శ్రీ రామ్' నినాదాలు చేస్తూ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. చివరికి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జి చేయాల్సి వచ్చింది.

## దిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి..!

ఇంటర్నెట్ డెస్క్: దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. సివిల్ లైన్స్‌లోని అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయ్' నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు భాజపా వర్గాలు వెల్లడించాయి. 35 ఏళ్ల వయసున్న ఓ వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు తెలిపాయి. తొలుత అతడు కొన్ని పేపర్లను సీఎంకు అందించిన తర్వాత ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను భాజపా దిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ ఖండించారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

అసలేం జరిగిందంటే..!

ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు దిల్లీ సీఎం రేఖా గుప్తా తన అధికారిక నివాసంలో ప్రతివారం 'జన్ సున్‌వాయ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ యువకుడు కొన్ని పేపర్లను ముఖ్యమంత్రికి అందించాడు. అంతలోనే గట్టిగా అరుస్తూ సీఎంపై దాడి చేశాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యక్తిగత భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని రాజ్‌కోట్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఊహించని పరిణామంతో ముఖ్యమంత్రి షాక్‌కు గురైనట్లు తెలుస్తోంది. ఆమెను వెంటనే వైద్య పరీక్షల కోసం ఆసుపత్రికి తరలించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిపై దాడిని రాజకీయ పక్షాలు ఖండించాయి. దిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా మాట్లాడుతూ.. దిల్లీ ప్రజల కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ముఖ్యమంత్రిపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రత్యర్థుల కుట్ర కావచ్చని అనుమానం వ్యక్తంచేశారు. దీనిలో ఏదైనా రాజకీయ పార్టీ ఉందా? అన్న కోణంలోనూ దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆతిశీ కూడా ఈ ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదన్నారు. నిందితులపై దిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి క్షేమంగా ఉన్నారని భావిస్తున్నామన్నారు.

# దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరం సింగపూర్, టోక్యోతో పోటీ పడుతోంది. మన వద్ద అన్ని ఉన్నప్పుడు చిత్తశుద్ధితో పనిచేయడం కావాలి. అమెరికాలో మన ఐటీ నిపుణులు పని చేయడం ఆపేస్తే స్తంభించిపోతుంది. రాష్ట్రంలో శాంతి భద్రతలతో కూడిన ఉద్యోగ భద్రత ఇచ్చాం. రాబోయే పదేళ్లలో వన్ బిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దుతాం. ఇప్పుడు మూసీ ప్రక్షాళన ఎందుకు అడ్డుకుంటున్నారు. మూసీ మురికిలో బతకాలని పేదలు ఎందుకు అనుకుంటారు? తెలంగాణ రైజింగ్ 2047తో అభివృద్ధి చేసుకుందాం. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన జరగాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సరైన సౌకర్యాలు లేవు. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పిస్తుంది. హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకొనే వారికి ప్రజలే అడ్డుకట్ట వేయాలి. మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కొంతమందికి ఇష్టం లేదు. తెలంగాణ సమగ్ర అభివృద్ధికి 2047 ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. హైదరాబాద్ పాత బస్తీ.. ఓల్డ్ సిటీ కాదు. ఒరిజినల్ సిటీ. మూసీ ప్రక్షాళనతో ఓల్డ్ సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొస్తాం. అన్ని సౌకర్యాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు



నిర్మించబోతున్నాం. ప్రభుత్వానికి రూపాయి ఖర్చు లేకుండా కార్యాలయాలు నిర్మిస్తున్నాం. నగర అభివృద్ధి అడ్డుకునే వారు మనకు శత్రువే" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ**

రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి అని కొనియాడారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ అమరుడు అయ్యారని రేవంత్ చెప్పుకొచ్చారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో పరిపాలన కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. నేడు దివంగత ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి. ఈ సందర్భంగా తెలంగాణ సెక్రటేరియట్ వద్ద రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి రేవంత్, కాంగ్రెస్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'దేశ సమగ్రతను కాపాడేందుకు రాజీవ్ గాంధీ అమరుడయ్యారు. దేశానికి సాంకేతిక నైపుణ్యాన్ని కృషి చేసిన పునాదులు వేసిన నేత రాజీవ్ గాంధీ. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం రాజీవ్ గాంధీ కల్పించారు. రాహుల్ గాంధీ దేశానికి ప్రధాని అవ్వగానే 21ఏళ్లకే ఎమ్మెల్యేగా పోటీ చేసే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడతాం. దేశ కలలు సహకారం కావాలంటే రాహుల్ గాంధీ ప్రధాని అవ్వాల్సిందే. స్థానిక సంస్థల్లో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన నేత రాజీవ్ గాంధీ. సిలికాన్ వ్యాలీని ఈరోజు మహిళలు నడుపుతున్నారు అంటే రాజీవ్ ఘనతే. నేటి యువతకు ఆయన స్ఫూర్తి ప్రదాత. రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణలో పరిపాలన కొనసాగిస్తున్నాం. ఎస్సీ ఉప కులాల వర్గీకరణకు మన ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. అలాగే, మూసీ ప్రక్షాళనను మన ప్రభుత్వం చేయబోతోంది అని చెప్పుకొచ్చారు.

# ప్లానింగ్ లేదు.. సమీక్ష లేదు..

పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎన్నడూ లేదని.. మరి ఈ పరిస్థితి రాష్ట్రంలో ఎందుకు వచ్చింది? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రాష్ట్రంలోని రైతన్నలు ఆలోచించాలని కోరుతున్నానన్నారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత రెండునెలలుగా తెలంగాణలో ఊరు, ఏ పల్లె చూసినా తండోపతండాలుగా రైతులు, వారి కుటుంబ సభ్యులు ఎక్కడికక్కడ అవస్థలు పడుతున్న పరిస్థితి, దయనీయమైన పరిస్థితి దేశం, రాష్ట్రం మొత్తం చూస్తున్నది. ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చిల్ల రాజకీయాలు చేయడం తెలుసు. బురదజల్లడం తెలుసు. కానీ, పనికివచ్చే ఒక్క పని చేతకాదని స్పష్టంగా తేలిపోయింది. చాతకాని కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వల్ల రైతులు ఒక బస్తా ఎరువు దొరక్క ఆగమాగమవుతున్న పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తున్నది. చివరికి పంట అమ్ముకోవాలి.. పంట కొనాలే ప్రభుత్వం అంటే రైతులు అధికారుల కాళ్లపై పడే దుస్థితి ఉంది. నేడు ఎరువుల బస్తాల కోసం కూడా ఎక్కడికక్కడ రైతులు కాళ్లావేళ్లపడి అధికారులను బతిమిలాడుకునే పరిస్థితి కనిపిస్తున్నది. అధికారుల కాళ్లు పట్టుకునే దౌర్భాగ్యమైన పరిస్థితి కనిపిస్తున్నది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎన్నడూ కాంగ్రెస్‌ది సానుకూలమైన చరిత్ర కాదు..**

'ఏ చరిత్ర చూసిన ఏం ఉన్నది గర్వకారణం అన్నట్లుగా.. కాంగ్రెస్ చరిత్ర ఎన్నడూ కూడా రైతుల విషయంలో సానుకూలమైన చరిత్ర కాదు. రైతులకు మేలు చేసే చరిత్ర కాదు. ఇవాళ మళ్లీ ఒకసారి ఆనాటి రోజులు తెస్తామని హామీ ఇచ్చిందో కాంగ్రెస్ పార్టీ.. దానికి అనుగుణంగానే.. ఆనాడు అర్ధరాత్రి బాయికాడ పండుకునే దుస్థితి ఉండెనో.. ఇవాళ మరోసారి చివరి మహిళా రైతు ఎరువుల దుకాణం వద్ద పడుకునే దుస్థితి కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పతనం మూలాన కనిపిస్తున్నది. కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వంలో ఆరు నెలల ముందే బఫర్ స్టాక్ తెప్పించి ఎక్కడికక్కడ గోదాములను సీజన్ మొదలుకాక ముందే నింపి పెట్టేది. భారత్‌లో ఎక్కడ యూరియా దొరికినా అక్కడి నుంచి తెప్పించి.. రైతుల కడుపులో చల్లకదలకుండా కూర్చునే విధంగా.. ఇంటికే ఎరువుల బస్తాలు పంపిన పరిస్థితిని కేసీఆర్ పాలనలో చూశాం. 4లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల సామర్థ్యం ఉన్నది మేం బాధ్యతలు చేపట్టిననాడు. రైతులకు మేలు జరగాలని 24లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యానికి సంవత్సరం, సంవత్సరన్నర లోపే తీసుకెళ్లిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిది' అని గుర్తు చేశారు.

**ప్లానింగ్ లేదు.. సమీక్ష లేదు..**

'గోదాములు ఉన్నా, రైతువేదికలున్నా, కష్టపడే రైతులు ఉన్నా.. కేసీఆర్ కష్టపడి చేయించిన మిషన్ కాకతీయ చెరువులు, అద్భుతంగా కట్టిన కాళేశ్వరంతో సహా ప్రాజెక్టులు కళకళలాడుతున్నా.. కానీ, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వానాకాలం సీజన్ మొదలైనా దున్నపోతుపై వానపడ్డట్లుగా ఉన్నది. కనీసం ప్లానింగ్ లేదు. సమీక్ష లేదు, సన్నద్ధ లేదు. ఎక్కడ ఆలోచన, ప్రణాళిక లేదు. ప్రణాళిక, అనుభవ రాహిత్యం, పరిపాలన చేతగానితనం, ఇతర అంశాలపై దృష్టిపెట్టడం వల్ల ఇవాళ రాష్ట్రంలో రైతులు అవస్థలు పడుతున్నరు. ఒక్కటంటే ఒక్కరోజు ముఖ్యమంత్రి వ్యవసాయంపై, ఎరువులపై సమీక్ష చేయలేదు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేసింది లేదు. పేరుకు రాహుల్ గాంధీనికి కలిసేందుకు వెళ్లి.. ఏదో కాగితం ఇచ్చి రావడం కాదు. సీనియస్‌గా, సిన్సియర్‌గా ఇక్కడ ఏ పరిస్థితి ఉంది? ఎట్లా వ్యవసాయ విస్తరణ కేసీఆర్ హయాంలో జరిగింది? దానికి అనుగుణంగా ఎంత ఎరువు కావాలనే ఇండెంట్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి వెళ్లలేదు. ముందస్తు ప్రణాళిక తయారు చేయలేదు. దాని ఫలితంగానే రాష్ట్రంలో ఎరువుల కొరత కనిపిస్తుంది. కేసీఆర్ ఉన్న పదేళ్లు ఎన్నడూ లైన్లు లేవు. ఎరువుల కోసం కొట్లాడుకునే పరిస్థితి లేదు. పోలీసులను పెట్టి ఎరువులు పంచే దుస్థితి ఎన్నడూ లేదు. మరి ఈ పరిస్థితి రాష్ట్రంలో ఎందుకు వచ్చింది? కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందో రాష్ట్రంలోని రైతన్నలు ఆలోచించాలి' అని కేటీఆర్ కోరారు.

**మూడు ఎరువుల బస్తాలు తీసుకుంటే రైతుపై నాన్ బెయిలబుల్ కేసు..**

**రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డ కేటీఆర్**

మూడు ఎరువుల బస్తాలు తీసుకుంటే రైతును జైలుకు పంపిన దుర్మార్గమైన ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. హైదరాబాద్ నందినగర్‌లోని నివాసం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఇవాళ రాష్ట్రంలో పోలీసులు రెండే పనులు చేస్తున్నారు ఒకటి బీఆర్ఎస్ నేతలపై ఎట్ల కేసులు పెట్టాలి. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా చిన్నచిన్న పిల్లలను కూడా భయపెట్టాలనేది ఒకటి. రెండోది ఎరువుల బస్తాల వద్ద కాపలా కాస్తున్నారు. ఎక్కడ రైతులు తిరగబడి అధికారులను తంతారేమోనని ఎక్కడికక్కడ పోలీసుల పహారా పెట్టి.. ఎరువుల దుకాణాల వద్ద ఎరువులు పంచే దుస్థితిలో ప్రభుత్వం ఉన్నది. వాస్తవం ఏంటంటే.. రాష్ట్ర వ్యవసాయశాఖ గానీ, మార్కెటింగ్‌శాఖ, మార్క్‌ఫెడ్ గానీ, రవాణాశాఖ, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది' అన్నారు.

**నాయకుడికే వ్యవాసయంపై అవగాహన లేదు**

'నడిపించే నాయకుడి వ్యవసాయంపై లేదు. పరిపాలనపై అంతకన్నా అవగాహన లేదు కాబట్టి వచ్చిన యూరియా పంచే పరిస్థితి కనిపించడం లేదు. ఇంకా దారుణం ఏంటంటే.. ఒకవైపు చాంతాడంత లైన్లు ఏ ఊరికి పోయినా కనిపిస్తుంటే.. వేలాది మంది రైతులు వర్షాల్లో లైన్లలో తండ్లాడుతుంటే.. ముఖ్యమంత్రి మాత్రం రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు.. ఇదంతా కృత్రిమ కొరత.. సోషల్ మీడియా సృష్టి అంటూ పనికిమాలిన డైలాగ్‌లతో టైంపాస్ చేస్తున్నరు తన జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని. క్షేత్రస్థాయిలో కూర్చొని, ఊర్లలోని తిరిగి, రైతులను కలిస్తే తెలుస్తుంది. దమ్ముంటే సీఎం, మంత్రి అయినా రైతుల వద్దకు వెళ్తే వారి పరిస్థితి, బాధేంటో తెలుస్తుంది. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని అభినందిస్తున్నాను. చాలాచోట్ల ఇవాళ క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలుబడుతున్నారు' అన్నారు.

**సిగ్గులేని మాటలు మాట్లాడుతుంది..**

'పార్టీ పిలుపు ఇవ్వకపోయినా, ఎక్కడికక్కడ స్వచ్ఛందంగా రైతులకు అండగా నిలబడ్డ బీఆర్ఎస్ నాయకత్వాన్ని అభినందిస్తున్నాను. ఊరూరా రైతులు ఆధార్ కార్డులు, వాటిపై రాళ్లు, క్యూలైన్లలో చెప్పుపెట్టి రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గువచ్చే విధంగా మీడియా ఆ దృష్యాలను ప్రసారం చేస్తుంటే.. అవి కనిపించనట్లు.. రైతుల ఆక్రందనలు వినబడనట్లుగా సిగ్గులేని మాటలు మాట్లాడుతుంది. మొన్నటి వరకు విత్తనాల కొరత, సాగునీటి సంక్షోభం.. కరెంటు కోతలు మరొకవైపు.. కొనుగోళ్ల లేమి మరొకవైపు.. ప్రస్తుతం ఎరువుల కొరత. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల రైతుల నిర్వాకం వల్ల రైతుల్లో ఇవాళ ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకుంటున్నాయి. ప్రభుత్వాన్ని తిట్టని రైతు లేదు. ఒక ఎకరానికి ఒక ఆధార్ కార్డుపై ఒకే బస్తా అని చెబుతుంటే ఇవాళ అవస్థలు పడుతున్నరు' అని తెలిపారు.

**రైతుపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు..**

'పరకాల దగ్గర నల్లబెల్లి అనే ఊరిలో ఒక రైతు తన భార్య, కొడుకుపై ఆధార్ కార్డులు కూడా తీసుకొని మూడు బస్తాలు తీసుకుంటే.. నాన్ బెయిలబుల్ కేసు పెట్టారు. వాళ్ల కుటుంబ సభ్యుల పేరుతో తీసుకుంటే జైలుకు పంపిన దుర్మార్గమైన ప్రభుత్వం రేవంత్ ప్రభుత్వం. ఇంత జరుగుతున్నా రేవంత్ పత్తా లేదు. కనీసం ఈ అంశంపై మాట్లాడడం లేదు. ఎక్కడికి వెళ్లిండో.. ఏం చేస్తున్నడో.. ఆయన ప్రభుత్వం ఏం చేస్తున్నదో చెప్పాలని కోరుతున్నా. 24గంటలు బురద రాజకీయాలు తప్ప.. రైతులకు పనికి వచ్చే ఒక్క పని చేయడం లేదనేది వాస్తవం. ఇంకో అనుమానం మాకుంది. కాంగ్రెస్ నాయకులు చానా మంది చాలాచోట్ల బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారనే అనుమానాలున్నాయి. లేకపోతే ఇంత కొరత రాదు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో రైతుల అవస్థలు లేవు. కాంగ్రెస్ రాగానే ఎందుకు ఆకస్మికంగా సమస్య వచ్చింది? బఫర్ స్టాక్‌లు పెట్టుకునే విధానం, నైపుణ్యం అధికారులకు ఉంది' అని పేర్కొన్నారు.

# మిస్ ఫైర్ అవుతున్న మర్వాడి గో బ్యాక్

**హైదరాబాద్ :** ఒకప్పుడు ఉద్యమాలు ప్రజల చైతన్యంతో జరిగేవి. ప్రజలు మూకుమ్మడిగా వీధుల్లోకి వచ్చేవారు. నినాదాలు చేసే వారు. నిరసనలు చేపట్టేవారు. తమ సమస్యను పరిష్కరించుకునేవారు. ఇలాంటి ఉద్యమాలే ప్రపంచ చరిత్ర గతిని.. భారతదేశ గతిని మార్చేశాయి. నేటి కాలంలో ఉద్యమాలు మొత్తం సోషల్ మీడియా ద్వారా జరుగుతున్నాయి. అంతటి అమెరికాలో కూడా ఇటీవల కాలంలో ట్రంప్ వ్యతిరేక ఉద్యమాలు సోషల్ మీడియా వేదిక ద్వారానే పుట్టడం విశేషం. ఇవి మాత్రమే కాదు చాలా ఉద్యమాలు సోషల్ మీడియా వేదికగానే జరుగుతున్నాయి.. ఈ ఉద్యమాలు సహించని వారు టూల్ కిట్ అంటూ ఏవేవో వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ.. ఉద్యమాలు చేసే వారు ఏమాత్రం ఆగడం లేదు. పైగా రకరకాల రూపాలలో ఉద్యమాలు చేస్తూ సంచలనం సృష్టిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో మార్వాడి గో బ్యాక్ అనే ఉద్యమం జరుగుతోంది. ఏకంగా అమనగల్లు అనే ప్రాంతంలో బంద్ కు పిలుపు కూడా జరిగింది. ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావడంతో ఈ బంద్ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఈ సమస్య మూలాలను ఒకసారి పరిశీలిస్తే.. నేటికీ గ్రామాల్లో కోమట్లు, స్వర్ణకారులు, ఇతర కులవృత్తుల వారు వారి వారి వ్యాపారాలు చేస్తున్నారు. మన తెలంగాణలోకి మార్వాడీలు ఎప్పటినుంచో వచ్చి ఇక్కడ



వ్యాపారం చేస్తున్నారు. మొదటి నుంచి కూడా స్థానికుల వ్యాపారాలలో మార్వాడీలు వేలు పెట్టకూడదని నిబంధన ఉన్నది. అయితే అమనగల్లు ప్రాంతంలో మార్వాడీలు ఈ నిబంధన అతిక్రమించారు. దీంతో స్థానిక వ్యాపారులలో ఆగ్రహం కలిగింది.. దీంతో వారు మార్వాడీలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం మొదలుపెట్టారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఇందులోకి కొన్ని శక్తులు ప్రవేశించాయి. అది కాస్త రాజకీయ రంగు పులుముకుంది. ఇది కాస్త తెలంగాణలో అశాంతిని, అభద్రతను కలగజేస్తుందని ఇంటలిజెన్స్ ద్వారా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం వెంటనే అప్రమత్తమైంది. అమనగల్లు ప్రాంతంలో ఉన్న స్థానిక వ్యాపారులు, మార్వాడీలతో సమావేశం నిర్వహించింది. ఇద్దరి మధ్య సయోధ్య కుదిరించింది. తద్వారా సమస్య పరిష్కారమైంది. ఈ సమస్య ఇక్కడితోనే ఆగి పోయేది కాదని.. ఇంకా చాలా దూరం వెళుతుందని విశ్లేషకులు అంటున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను ముగిసిపోయింది అనుకోవద్దని.. దీని మూలాలను కనుగొని పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని విశ్లేషకులు అంటున్నారు.. సమస్య ప్రస్తుతం తాత్కాలికంగా పరిష్కారం మాత్రమే అయిందని.. ఇంకా అనేక రకాల రూపాలలో ఈ సమస్య తెలంగాణ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుందని రాజకీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కాళేశ్వరం కమిషన్‌పై 21న తెలంగాణ హైకోర్టులో విచారణ

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాల్జేసే రాజకీయ వ్యూహంలో భాగంగా కమిషన్ నియామకం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని పిటిషన్లలో పేర్కొన్నారు.

## మేడారం జాతర.. తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

**వరంగల్:** మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర నిర్వహణ కోసం తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల ఆధ్యాత్మిక కుంభమేళా అనబడే ఈ మహెూత్సవం విజయవంతంగా సాగేందుకు, మేడారంలో శాశ్వత నిర్మాణాలు, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించబోయే మేడారం మహా జాతర ఎన్నడూ లేని రీతిలో వైభవోపేతంగా జరగనుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా మంజూరు చేసిన నిధుల పట్ల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అట్లూరు లక్ష్మణ్ కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లూ భట్టి విక్రమార్కకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. "ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గిరిజనుల గౌరవానికి ప్రతీక. మేడారం మహా జాతర కోసం 150 కోట్ల రూపాయలు మంజూరు చేయడం, గిరిజనులపట్ల సీఎం రేవంత్‌రెడ్డి కట్టుబాటు, మద్దతుకు నిదర్శనం. ఈ సారి జాతర మరింత గొప్పగా, చారిత్రాత్మకంగా జరుగుతుంది" అని పేర్కొన్నారు.


## మద్యం దుకాణాల టెండర్లకు నోటిఫికేషన్..



-మొదటిపేజీ తరువాయి

రుసుమును ఏకంగా లక్ష రూపాయలు పెంచి రూ. 3 లక్షలు చేసింది. ఫిక్స్‌డ్ షాప్ టాక్స ఆధారంగా లాటరీ పద్ధతిలో వైన్ షాపులను కేటయించనున్నారు. దరఖాస్తు దాఖలులో ఎలాంటి పరిమితులు లేవు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించుకోవచ్చు. లైసెన్స్ కాల పరిమితిలో ఎలాంటి మార్పు లేదు. డిసెంబర్ 1, 2025 నుంచి నవంబర్ 30, 2027 వరకు మాత్రమే నిర్ణయించారు. ఇకసారి మద్యం షాపు కేటాయింపుల్లో 30 రిజర్వేషన్లకు కేటాయించారు. గౌడ్స్ సామాజిక వర్గానికి 15 శాతం, షెడ్యూల్ కులాల సామాజిక వర్గాలనికి 10 శాతం, షెడ్యూల్ తెగల సమాజిక వర్గానికి 5 శాతం వైన్స్ షాపులను కేటాయించనున్నారు. టెండర్ల ప్రక్రియల్లో పాల్గొనేందుకు భాగస్వామ్య సంస్థలకు, కంపెనీలకు సైతం అవకాశం కల్పించారు. ఈసారి లైసెన్స్ ఫీజులో ఎలాంటి మార్పులు చేయలేదు. ఎంపికైన లైసెన్స్‌దారులు 6 స్లాబుల ద్వారా లైసెన్స్ ఫీజు చెల్లుకునేందుకు వీలు కల్పించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈసారి కూడా మద్యం దుకాణాల లైసెన్స్ జారీకి సిద్ధమవుతోంది రాష్ట్ర ప్రభుత్వం. తెలంగాణలో మద్యం వ్యాపారం లాభాల పంటగా భావిస్తుంటారు. అందుకే.. ఏటికేడు ఈ వ్యాపారం వైపు చొరవ చూపేవారి సంఖ్య పెరుగుతోంది. కాగా, వైన్స్ షాపు దరఖాస్తు ప్రక్రియకు సంబంధించిన తుది తేదీలను ప్రకటించాల్సి ఉంది.

## పావురం అరెస్ట్



**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లాలోని బోధన్ మండలం భవానిపేట గ్రామంలో ఒక అనుమానాస్పద పావురం కలకలం సృష్టించింది. ఒక మైనర్ బాలుడు ఈ పావురాన్ని కనుగొన్నాడు. పావురం కాలికి ఒక కోడ్ రింగ్, రెక్కలపై కోడ్ లెటర్స్ ఉన్నాయి, ఇవి సాధారణ పావురాలకు భిన్నంగా ఉండటంతో గ్రామస్తులకు అనుమానం కలిగింది. పావురం గూఢచారి కార్యకలాపాలకు సంబంధించినది కావచ్చని అనుమానించిన గ్రామస్తులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. బోధన్ పోలీసులు పావురాన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పావురంపై ఉన్న కోడ్ రింగ్ , లెటర్స్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పావురం రెక్కలపై కోడ్ లెటర్స్ మరియు కాలికి ఉన్న రింగ్ గూఢచర్యానికి సంబంధించినవి కావచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఇలాంటి పావురాలను గతంలో కొన్ని దేశాలు గూఢచార సమాచార సేకరణకు ఉపయోగించిన సందర్భాలు ఉన్నాయి. పోలీసులు పావురంపై ఉన్న కోడ్ లెటర్స్ ఏ భాషకు సంబంధించినవో, అవి ఏదైనా సందేశాన్ని కలిగి ఉన్నాయా అనే విషయాలను పరిశీలిస్తున్నారు. ఈ కోడ్ రింగ్ ఒక ట్రాకింగ్ డివైస్ లేదా గుర్తింపు ట్యాగ్ కావచ్చని కూడా భావిస్తున్నారు. పావురం ఎక్కడ నుండి వచ్చింది, దాని ఉద్దేశం ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడానికి పోలీసులు విచారణ చేస్తున్నారు. అలాగే, ఈ పావురం స్థానికంగా ఉన్న ఏదైనా పక్షి సంరక్షణ కేంద్రం లేదా పరిశోధన సంస్థకు సంబంధించినదా అని కూడా ఆరా తీస్తున్నారు. పావురంపై ఉన్న కోడ్‌లను డీకోడ్ చేయడానికి లేదా దాని మూలాన్ని గుర్తించడానికి సైబర్ నిపుణులు లేదా గూఢచర్య నిపుణుల సహాయం తీసుకునే అవకాశం ఉంది. గతంలో భారతదేశంలో, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాలలో, ఇలాంటి అనుమానాస్పద పావురాలు కనిపించిన సందర్భాలు ఉన్నాయి. ఉదాహరణకు, 2020లో పంజాబ్‌లో ఒక పావురం పాకిస్తాన్ నుండి గూఢచారిగా అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. కానీ తర్వాత అది సాధారణ పావురమని తేలింది. అయితే ఇది పందేపు పావురం కూడా కావొచ్చని భావిస్తున్నారు. తమిళనాడులో పావురాల పందేలు చాలా ఫేమస్. వీటిపై చాలా సినిమాలు కూడా వచ్చాయి. ప్రొఫెషనల్ గా పావురాలను పెంచి పందేల కోసం ట్రైనింగ్ ఇస్తూంటారు. వారు తమ పావురాల గమన్నాన్ని గుర్తించడానికి డివైస్‌లు కూడా వాడుతున్నారు. బహుశా ఆ పావురమే బోధనలో చిక్కి ఉంటుందన్న అనుమానాలు కూడా ఉన్నాయి. పోలీసులు ఈ దిశగా కూడా దర్యాప్తు చేసే అవకాశం ఉంది. బోధన్‌లోని భవానిపేటలో కనుగొన్న ఈ పావురం స్థానికంగా గూఢచారి అనుమానాలను రేకెత్తించినప్పటికీ, దీని నిజమైన ఉద్దేశం గురించి ఇంకా స్పష్టత లేదు. పోలీసుల దర్యాప్తు ఈ సంఘటన వెనుక ఉన్న వాస్తవాలను వెలికితీసే అవకాశం ఉంది.

# గట్ హెల్త్‌కు బెస్ట్ ఫుడ్స్..!



మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందాలంటే జీర్ణక్రియ సక్రమంగా పనిచేయాలి. కడుపు ఆరోగ్యం బాగుంటే శరీరం ఫిట్‌గా ఉత్సాహంగా ఉంటుంది. అల్లం, చియా గింజలు, గ్రీన్ టీ, సోంపు వంటి సహజ ఆహారాలు జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా గట్ హెల్త్‌ను బలపరుస్తాయి.మన శరీరానికి కావాల్సిన పోషకాలు అందాలంటే ఆహారం సరైన విధంగా జీర్ణం కావాలి. కడుపు ఆరోగ్యం బాగుంటేనే మనం ఫిట్‌గా, యాక్టివ్‌గా ఉంటాం. అందుకే జీర్ణక్రియను మెరుగుపరచి గట్ హెల్త్‌ను కాపాడే ఫుడ్స్ ని తీసుకోవాలి. ఆ ఫుడ్స్ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.అల్లంలో సహజంగానే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది జీర్ణక్రియను సులభతరం చేయడంలో హెల్ప్ చేస్తుంది. వాంతులు, కడుపులో ఉబ్బరం లాంటి సమస్యలను తగ్గించడంలో అల్లం బెస్ట్‌గా పనిచేస్తుంది. అల్లంలో ఉండే జింజెరాల్ అనే పదార్థం జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. అందుకే ఫుడ్‌లో అల్లం వాడటం లేదా అల్లం టీ తాగడం వల్ల కడుపు ఆరోగ్యం మెరుగుపడుతుంది.చియా గింజల్లో ఉండే ఫైబర్, ప్రోటీన్ కడుపు ఆరోగ్యాన్ని కాపాడటంలో కీ రోల్ ప్లే చేస్తాయి. ఇవి కడుపులో ప్రీబయోటిక్ జెల్‌ను తయారు చేసి మంచి బ్యాక్టీరియాకు పోషకాలను అందిస్తాయి. చియా గింజల్లోని ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది.గీన్ టీలో ఉండే పోలీఫినాల్స్ ప్రీబయోటిక్‌లుగా పనిచేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. సోంపులో అనిథోల్ అనే ముఖ్యమైన పదార్థం ఉంటుంది. ఇది గ్యాస్, బ్లోటింగ్ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. భోజనం చేశాక కొద్దిగా సోంపు నమిలితే జీర్ణక్రియ ఈజీగా జరిగి కడుపు హాయిగా ఉంటుంది.

# దాల్చిన చెక్క చేసే అద్భుతాలు



దాల్చిన చెక్క వంటింట్లో సర్వసాధారణంగా వాడే ఒక మసాలా దినుసు. ఇది రుచికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి అనేక లాభాలను అందిస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణ నుంచి గుండె ఆరోగ్యం వరకు.. జీర్ణక్రియ నుంచి ఇమ్యూనిటీ పెంపు వరకు దాల్చిన చెక్క అద్భుత ప్రయోజనాలు కలిగి ఉంది.దాల్చిన చెక్కతో ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలు. దాల్చిన చెక్క కేవలం వంటకు రుచిని ఇవ్వడమే కాదు.. అది మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. దీన్ని మీ రోజు వారీ ఆహారంలో చేర్చుకుంటే ఎన్నో అద్భుతమైన లాభాలు పొందవచ్చు. మధుమేహం ఉన్నవారికి దాల్చిన చెక్క ఒక వరం. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో చాలా బాగా పనిచేస్తుంది.మీ ఆహారంలో దాల్చిన చెక్కను చేర్చుకుంటే కొలెస్ట్రాల్, రక్తపోటు కంట్రోల్ లో ఉంటాయి. దాని వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. దాల్చిన చెక్కలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో బాగా హెల్ప్ చేస్తాయి. దాల్చిన చెక్కలో ఉండే కొన్ని ప్రత్యేక సమ్మేళనాలు మెదడు పనితీరును పెంచుతాయి. జ్ఞాపకశక్తికి సంబంధించిన వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. దాల్చిన చెక్క మంచి జీర్ణక్రియకు తోడ్పడుతుంది. ఇది పేగుల ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరుస్తుంది. దాల్చిన చెక్కలో ఉండే యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ లక్షణాలు ఇన్‌ఫెక్షన్లతో పోరాడి, మీ ఇమ్యూనిటీని పెంచుతాయి. దాల్చిన చెక్క బరువు తగ్గించడంలో కూడా బాగా పనిచేస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేసి ఆకలిని తగ్గిస్తుంది. ఫలితంగా మీరు ఈజీగా బరువును కంట్రోల్ చేయొచ్చు. దాల్చిన చెక్కను మీ డైట్‌లో చేర్చుకుని ఈ ఆరోగ్య లాభాలను పొందండి. అయితే ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే నిపుణుల సలహా తీసుకోవడం మర్చిపోవద్దు.

### బ్రిస్క్ వాకింగ్, నార్మల్ వాకింగ్..

# గుండెకు ఏది మంచిది?





వాకింగ్ వల్ల బరువు తగ్గేందుకు కూడా మేలు చేస్తుంది. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే, ఈ వాకింగ్‌లో నడిచే వేగాన్ని బట్టి రెండు రకాల వాకింగ్‌లు ఉన్నాయి. ఒకటి వేగంగా నడవటం దీన్నే బ్రిస్క్ వాకింగ్ అంటారు. మరొకటి నెమ్మదిగా నడవటం. మంచి ఆరోగ్యం కోసం ప్రజలు సరైన ఆహారంతో పాటు తగిన వ్యాయామం కూడా చేస్తుంటారు. ఇందులో శారీరక వ్యాయామం కోసం ఎక్కువ మంది ప్రజలు వాకింగ్ చేస్తుంటారు. ఎందుకంటే వాకింగ్ చేయడం చాలా ఈజీ. రోజూ వాకింగ్ చేయడం వల్ల చాలా లాభాలు ఉంటాయని నిపుణులు కూడా చెబుతుంటారు. వాకింగ్ ఎఫెక్ట్‌తో దీర్ఘకాలంలో ఎంతో మేలు జరుగుతుందని చెబుతున్నారు. వాకింగ్ వల్ల బరువు తగ్గేందుకు కూడా మేలు చేస్తుంది. డయాబెటిస్, బీపీ తగ్గించడంలో కూడా వాకింగ్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. అయితే, ఈ వాకింగ్‌లో నడిచే వేగాన్ని బట్టి రెండు రకాల వాకింగ్‌లు ఉన్నాయి. ఒకటి వేగంగా నడవటం దీన్నే బ్రిస్క్ వాకింగ్ అంటారు. మరొకటి నెమ్మదిగా నడవటం. ఈ రెండింటిలో ఏది బెస్ట్ అనేది తప్పనిసరిగా తెలుసుకోవాలి. సాధారణ వేగంతో నడవటం కంటే బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. వేగంగా నడవటం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుంది. బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. వేగంగా నడవటం వల్ల రక్తప్రసరణ బాగుంటుంది. దీంతో గుండె సంబంధిత సమస్యలు రావు. అంతేకాదు.. సాధారణ వాకింగ్‌తో పోల్చితే బ్రిస్క్ వాకింగ్ వల్ల ఎక్కువ కేలరీలు బర్న్ అవుతాయి. బరువు తగ్గాలనుకునేవారికి బ్రిస్క్ వాకింగ్ మంచి ఎంపిక. బ్రిస్క్ వాకింగ్ చేయడం వల్ల ఫిట్‌నెస్ లెవెల్స్ పెరుగుతాయి. అలసట తగ్గుతుంది. నిత్యం ఎనర్జిటిక్‌గా ఉండొచ్చు. సాధారణ వాకింగ్‌తో పోల్చితే బ్రిస్క్ వాకింగ్ చేస్తే ఎండార్ఫిన్లు ఎక్కువగా రిలీజ్ అవుతాయి. దీని వల్ల ఒత్తిడి తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా మారుతుంది. శారీరక సమస్యలు ఉన్నవారు, కీళ్ల నొప్పులతో ఇబ్బంది పడేవారు, నరాల సమస్య ఉన్న వారు నెమ్మదిగా నడవటం మంచిది. నెమ్మదిగా నడిస్తే రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ ఉన్నవారు రెగ్యులర్‌గా నెమ్మదిగా నడవటం మంచిది. నెమ్మదిగా నడవటం వల్ల మైండ్‌ఫుల్‌నెస్ అలవాటు అవుతుంది. దీని వల్ల మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# బొప్పాయి వీళ్లకు వేరీ డేంజర్..

బొప్పాయి పండు.. తినేందుకు ఎంతో రుచికరంగా ఉండటమే కాదు..అనేక పోషకాలతో సమృద్ధిగా ఉంటుంది. అంతేకాదు.. ప్రతి సీజన్‌లోనూ దొరుకుతూ ఉంటుంది. పైగా దీన్ని చాలా మంది ఇష్టంగా తింటారు. సాధారణంగా ఇది ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. కానీ, బొప్పాయి తినడం వల్ల కొంతమందికి హాని కలుగుతుంది. బొప్పాయి పండులో ఉన్న పోషకాలు మరే ఫ్రూట్‌లో కూడా లేవంటారు ఆరోగ్య నిపుణులు. కుదిరినప్పుడల్లా బొప్పాయి పండుని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. బొప్పాయి పండును గుజ్జుగా చేసి చిన్న పిల్లలకు తినిపిస్తే చాలా మంచిదంటున్నారు నిపుణులు. గర్భిణీ స్త్రీలు బొప్పాయి తినకూడదు ఎందుకంటే దానిలో వారి ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపే కొన్ని అంశాలు ఉంటాయి. పచ్చి బొప్పాయిలో గర్భస్రావం కలిగించే పదార్థం ఉంటుంది. కాబట్టి, గర్భిణీ స్త్రీలు పండిన బొప్పాయిని మాత్రమే తినాలి. ఇది వారికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. వారు సురక్షితంగా ఉంటారు. జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా బొప్పాయి తినకుండా ఉండాలి. బొప్పాయిలో కొంతమందిలో కడుపులో చికాకు లేదా గ్యాస్ కలిగించే కొన్ని అంశాలు ఉంటాయి. దీనితో పాటు, బొప్పాయిని అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు లేదా వాంతులు వంటి సమస్యలు కూడా వస్తాయి. అందువల్ల, జీర్ణ సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించి దాని పరిమాణంపై శ్రద్ధ వహించిన తర్వాత మాత్రమే బొప్పాయి తినడం మంచిది. మధుమేహ రోగులు కూడా బొప్పాయి తినకూడదు ఎందుకంటే ఇందులో రక్తంలో చక్కెర స్థాయిని పెంచే కొన్ని అంశాలు ఉంటాయి. దీనితో పాటు, బొప్పాయిలో సహజమైన తీపి కూడా ఉంటుంది, ఇది మధుమేహ రోగులకు హానికరం. ఒక వ్యక్తి మధుమేహానికి చికిత్స పొందుతుంటే, అతని ఆరోగ్యంపై ఎటువంటి ప్రతికూల ప్రభావం ఉండకుండా వైద్యుడిని సంప్రదించిన తర్వాతే బొప్పాయి తినాలి. కొంతమందికి బొప్పాయి అలెర్జీ ఉండవచ్చు. ఇది దురద, దద్దుర్లు లేదా శ్వాస సమస్యలను కలిగిస్తుంది. ఇప్పటికే గుండె జబ్బులు ఉన్నవారు కూడా బొప్పాయి తినకూడదు ఎందుకంటే దాని వినియోగం వారి గుండెను ప్రభావితం చేస్తుంది. దీనితో పాటు, బొప్పాయిలో ఉండే కొన్ని అంశాలు అధిక రక్తపోటు లేదా ఇతర గుండె సంబంధిత సమస్యలను పెంచుతాయి. అందువల్ల, గుండె రోగులు వైద్యుడిని సంప్రదించిన తర్వాత మాత్రమే బొప్పాయిని తీసుకుంటే మంచిది.



# బెల్లం తిన్నా రోగాలు తప్పవట..!



బెల్లం ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. ముఖ్యంగా తెల్ల చక్కెరతో పోలిస్తే, బెల్లం ప్రతి పరిస్థితిలోనూ నిజంగా ప్రయోజనకరంగా ఉంటుందా..? అంటే ఆలోచించాల్సిందే.. బెల్లం ఇనుము, కాల్షియం, భాస్వరం వంటి పోషకాలను కలిగి ఉంటుంది. కానీ, బెల్లం అధిక వినియోగం కూడా కొంత హాని కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బెల్లంలో కేలరీలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా కలిగి ఉంటుంది. అందువల్ల దాని అధిక వినియోగం బరువును పెంచుతుంది. మీరు మీ బరువును నియంత్రించాలనుకుంటే పరిమిత పరిమాణంలో మాత్రమే బెల్లం తినండి. ముఖ్యంగా మీరు ఊబకాయంతో బాధపడుతుంటే లేదా బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే బెల్లం వినియోగాన్ని తగ్గించండి. బదులుగా, తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలను అందించే పండ్లు, కూరగాయలను తినండి. బెల్లంలో సహజ చక్కెర ఉంటుంది. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రమాదకరం. దీనిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. ఇది మధుమేహ సమస్యను పెంచుతుంది. అందువల్ల, మధుమేహ వ్యాధిగ్రస్తులు బెల్లం తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. బదులుగా వారు తమ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడే, చక్కెర తక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. బెల్లం తీసుకోవడం వల్ల దంతాలకు కూడా హానికరం. ఇందులో ఉండే చక్కెర బ్యాక్టీరియాను కలిగిస్తుంది. ఇది దంతక్షయానికి కారణమవుతుంది. అందువల్ల, రాత్రి పడుకునే ముందు మీ దంతాలను పూర్తిగా శుభ్రం చేసుకోండి. తద్వారా బ్యాక్టీరియా ఉండదు. దీనితో పాటు మీ దంతాలను క్రమం తప్పకుండా బ్రష్ చేసుకోండి. మౌత్ వాష్ వాడండి, తద్వారా మీ దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి. దీనితో పాటు, ఎప్పటికప్పుడు దంతవైద్యునిచే చెక్ చేయించుకోవడం కూడా ముఖ్యం.బెల్లం అధికంగా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై చెడు ప్రభావం చూపుతుంది. ఇది గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలను కలిగిస్తుంది. మీరు జీర్ణ సమస్యలను నివారించాలనుకుంటే బెల్లంను పరిమిత పరిమాణంలో తీసుకోండి. దానితో నీరు లేదా మజ్జిగ త్రాగండి. తద్వారా జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. దీనితో పాటు జీర్ణక్రియను మెరుగుపరచడంలో, గ్యాస్ సమస్యలను నివారించడంలో సహాయపడే ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోండి. బెల్లం గర్భిణీ స్త్రీలకు కూడా హానికరం ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఇనుము ఉంటుంది. ఇది గర్భధారణ సమయంలో హాని కలిగిస్తుంది. ఇది తల్లి, బిడ్డ ఇద్దరిపైనా చెడు ప్రభావాన్ని చూపుతుంది. అందువల్ల గర్భిణీ స్త్రీలు బెల్లం తినే ముందు వైద్యుడిని సంప్రదించాలి. దీనితో పాటు వారు సమతుల్య ఆహారం తీసుకోవాలి. ఇందులో పండ్లు, కూరగాయలు తినడం కూడా ఉంటుంది. తద్వారా వారి ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

## నాణ్యత ప్రమాణాలు లేక ప్రజల ప్రాణాలతో

# చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్లు

**కఠిన చర్యలు తప్పవు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..**

**జమ్మికుంట :** ప్రజలకు అనువుగా ఉండేందుకు జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో వాటర్ ప్లాంట్ లను ఏర్పాటు చేసుకున్నారని, నాణ్యత ప్రమాణాలు లేకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వాటర్ ప్లాంట్ లపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్, అన్నారు. బుధవారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని జయశ్రీ వాటర్ ప్లాంట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు నాణ్యమైన తాగు నీరు అందించాలని ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ లోని క్యాన్లు 90రోజులకు ఒకసారి మార్చాలని, నీటిలో ఎంత శాతం క్లోరిన్ కలపాలో కూడా తెలియని షాప్ లోని వర్కర్లను షాప్ లలో ఉంచుతున్నారని, క్యాన్ లో పురుగులు ఉంటున్నాయని కమిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు ఇచ్చి రోగాలను తెచ్చుకుంటున్నామని, ఇటువంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీ పరిధిలో 25 వాటర్ ప్లాంట్ లు ఉన్నాయని, వాటిని తనిఖీ చేస్తామని ఆయన అన్నారు. షాప్ లైసెన్స్ ల గడువు ముగిసిన రెన్యువల్ చేసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. కొన్ని ప్లాంట్ లలో క్లోరిన్ కు బదులుగా బ్లీచింగ్ కలుపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్ష కాలంలో ప్రజలు ఎల్లప్పుడూ మిషన్ భగీరథ నీటిని కానీ, ప్లాంట్ లో కొన్న నీటిని కానీ కాచి చల్లార్చి తాగాలన్నారు. ప్రజలు తాగే ప్రతి నీటిని కాచి చల్లార్చాలని ఆయన విజ్ఞప్తి



చేశారు. తక్షణమే వాటర్ ప్లాంట్ లైసెన్స్ రెన్యువల్ చేసుకొని వారు చేసుకోవాలని, బి.ఎస్.ఐ. సర్టిపై ఉన్న క్లోరిన్ నే కలపాలన్నారు. తొందర్లోనే అన్ని షాపులు తనిఖీలు చేస్తామని, ప్రజలకు హాని కలిగించే వాటర్ ప్లాంట్ లను సీజ్ చేస్తామని, షాప్ లోని వర్కర్ లకు కానీ, యజమానులకు కానీ క్లోరిన్ ఎంత మేరకు కలపాలో తెలిసి ఉండాలన్నారు. అనంతరం గణేష్ హోల్ సేల్ షాపును తనిఖీ నిర్వహించారు. అందులో అమ్మే పలు వస్తువుల గడువు కాలం పరిశీలించి, బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించడంపై ఫైన్ వేశారు. పట్టణంలో బ్యాన్ అయిన ప్లాస్టిక్ కవర్లను వాడకూడదని, ప్రజలు జమ్మికుంటను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ గా తీర్చి దిద్దడంలో సహకరించాలని కమిషనర్ మహమ్మద్ అయాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ లు మహేష్, సదానందం, ఈఈ శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది తో పాటు పలువురు పాల్గొన్నారు...

## జమ్మికుంటలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, జయంతి వేడుకలు

**జమ్మికుంట :** మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 80వ, జయంతి సందర్భంగా జమ్మికుంటలో మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా దేశిని కోటి, సుంకరి రమేష్, .పొన్నగంటి మల్లయ్య, మాట్లాడుతూ స్వర్గీయ రాజీవ్ గాంధీ, ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు కమ్యూనికేషన్ రంగంలో సాంకేతిక రంగంలో మన దేశానికి విదేశీ పెట్టుబడులు లాంటి అనేకమైన సంస్కరణలు తీసుకవచ్చి దేశ అభివృద్ధి దేశ పురోగతిని చక్కదిద్దారని 21 సంవత్సరం ఉండబడిన ఓటు హక్కును 18 సంవత్సరాలకే కుదించారని. భారతదేశం కోసం అనేకమైన కార్యక్రమాలు నిర్వహించారని చివరికి దేశం కోసమే ప్రాణాలర్పించారన్నారు. అలాంటి గొప్ప కుటుంబం రాజీవ్ గాంధీ కుటుంబం అని వారి మాతృమూర్తి స్వర్గీయ ఇందిరా గాంధీ, కూడా దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. 2004 ఽ 2009లో దేశ ప్రధానమంత్రిగా రాహుల్ గాంధీ,కి అవకాశం వచ్చిన పదవులు ముఖ్యం కాదు ఈ దేశ ఆర్థిక వ్యవస్థ బాగుండాలని ఒక ఆర్థికవేత్త అయిన మన్మోహన్ సింగ్, ను రెండుసార్లు ప్రధానమంత్రిగా చేసి భారతదేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారని మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించారని. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశారన్నారు. ఇలాంటి కుటుంబం కోసం వారి ఆశయాలను వారి ఆశ సాధనల




కోసం మనందరం కలిసికట్టుగా కాంగ్రెస్ యువ నాయకులు సైనికులుగా పనిచేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, ఎలగందుల స్వరూప, శ్రీహరి, శ్రీపతి నరేష్, దిడ్డి రాము, మార్కెట్ డైరెక్టర్ రాజేశ్వరరావు, సూర్య, .కాంగ్రెస్ నాయకులు పర్లపల్లి నాగరాజ్, ముద్దమల్ల రవి, పంజాల అనిల్, ఎండి సలీంపాషా, పిడుగు భాగ్యలక్ష్మి, కుదాడి తిరుపతి, మర్రి రామ్ రెడ్డి, అశోక్, భాస్కర్,.ప్రవీణ్, .తిరుపతి, శ్రీనివాస్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు..

# స్వర్గీయ రాజీవ్ గాంధీ సేవలు దేశానికే ఆదర్శం

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ద కుమార్...**

**జమ్మికుంట :** ఇల్లందకుంట మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కుమార్, ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ, 81 వ,జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.పూల మాలలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ, సేవలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కొనియాడారు. రాజీవ్ గాంధీ, ప్రధానిగా ఆధునికత ప్రగతిశీల సంస్కరణలు తీసుకొచ్చి దేశానికి గొప్ప మార్గాన్ని చూపారని కొనియాడారు.సైన్స్ ని ప్రోత్సహించారు., టెలీకాం రంగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. శాంతి ప్రజాస్వామ్య విలువలకు తన జీవితాన్ని అంకితం చేశారని,ఈ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని యువతకు అవకాశాలు కల్పించి దేశ ప్రగతికి పాటుపడాలని సంకల్పించారని.ఓటు హక్కు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు గొప్ప అవకాశాన్ని కల్పించారని అన్నారు.రాజీవ్ గాంధీ,పంజాబ్ ఒప్పందం, ఇండియా మరియు శ్రీలంక ఒప్పందం వంటి శాంతి నిర్ణయాలతో ప్రపంచ మన్ననలు పొందారన్నారు.ఈ కార్యక్రమలో ఉప్పల శ్రీనివాస్ రెడ్డి, కనుమల్ల సంపత్, వంగ రామకృష్ణ, గొడిశాల పరమేశ్వర్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, గంగారం మహేష్,పెద్ది శివకుమార్, గొడుగు మానస, మీసా రాజయ్య, భోగం సాయిరాం, తోడేటి



కిషన్, బండి మల్లయ్య, మర్రి వీరారెడ్డి, గోరుకుంట్ల స్వామి, బైరెడ్డి కొండారెడ్డి, గడ్డి శ్రీనివాస్, మోతే మహేందర్, మంకు ఐలయ్య, గొట్టే రాజశేఖర్, తాడెం దిలీప్, దంసాని తిరుపతి,రావుల రాజబాబు, దార నరేష్, రేణిగుంట రవీందర్ రావుల మోహన్ రెడ్డి,ఉప్పుల మల్లారెడ్డి,ఉప్పుల శ్రీనివాసరెడ్డి, శాతాల మధు, మారేపల్లి వంశీ,జక్కు కుమారస్వామి, ఆకనపల్లి వెంకటేష్,గుండార కిరణ్, పైడిపల్లి దేవేందర్, ఎండి అజ్గర్ పాషా, దాసరి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు....

## గోదావరి నది పరివాహక లోతట్టు వరద ముంపునకు

# గురి అయ్యే గిరిజన ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఐటీడీఏ ప్రాజెక్టు అధికా బి. రాహుల్**

**భద్రాద్రి కొత్తగూడెం:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 43 అడుగులకు చేరుకున్నందున మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున ఎగవ కురుస్తున్న వర్షాలకు గోదావరి క్రమేపీ పెరుగుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నందున, గోదావరి నది పరివాహక లోతట్టు ప్రాంత గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐ టి డి పి ఓ రాహుల్ అన్నారు. అత్యవసరమైతేతప్ప బయటికి రావద్దని సూచించారు.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వాగులు,వంకలు పొంగిపొర్లు తున్నాయని అన్నారు.ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువులు,వాగులు,వంకల వద్దకు వీడియోల కోసం,సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు.వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థినీ విద్యార్థులు పొంగుతున్న వాగులు, చెక్ డ్యాముల వద్దకు వెళ్లకుండా చూడాలని అన్నారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు వరద




ముంపునకు గురి అయితే వెంటనే అధికారుల సూచనలు పాటించి పునరావాస కేంద్రాలకు వెళ్లాలని అన్నారు. అత్యవసరమైన విపత్కరమైన పరిస్థితులు ఏమైనా ఉంటే వెంటనే సంబంధిత కంట్రోల్ రూమ్ నంబర్లు భద్రాద్రి కొత్తగూడెంపాల్వంచ 08744-241950, (వాట్సాప్) 93929 19743, ఐటీడీఏ భద్రాచలం కంట్రోల్ రూమ్ నెంబర్ 799 5268 352, సబ్ కలెక్టర్ ఆఫీస్, భద్రాచలం 08743-2324444, (వాట్సాప్) 93479 10737 నంబర్లకు ఫోన్ ద్వారా తెలియజేయాలని ఆయన కోరారు.

## ఇందిరా పార్కు వద్ద జరిగే సత్య గ్రహ దీక్ష విజయవంతం చేయండి

**రామగుండం అధ్యక్షుడు నరేష్**



**రామగుండం : ఆగస్టు 20 (ధర్మఘంట)** ఈనెల 25న తేదీన ఎంపీ %=% కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సమస్యల కోసం నిర్వహించే సత్య గ్రహ దీక్ష వాల్ పోస్టర్ ను రామగుండం నియోజకవర్గం లో తెలంగాణ బీసీ ప్రజా సంఘం నియోజకవర్గం అధ్యక్షులు పోలవేణి నరేష్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల ముందు 42.శాతం రిజర్వేషన్లు కల్పించాలని నరేష్ అన్నారు ఈ కార్యక్రమంలో గర్వందుల శ్రీకాంత్, అన్వేష్, కృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## ఏసీబీకి చిక్కిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

**కోదాడ : ఆగస్టు 20( ధర్మఘంట న్యూస్ )**



ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సంఘటన సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. నల్లగొండ జిల్లా ఏసీబీ రేంజ్ ఆఫీసర్ జగదీష్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం వుడ్ వ్యాపారి హరినాయకు వ్యాపార నిమిత్తం చెట్లు కొనుగోలు చేశాడు. ఆ చెట్లకు ప్రభుత్వానికి తీయాల్సిన చలానా ఉండగా బీట్ ఆఫీసర్ వెంకన్న ను సంప్రదించగా , 50 వేలు రూపాయలు చెల్లిస్తేనే అనుమతి ఇస్తానని చెప్పడంతో హరి నాయక్ ఎసిబి నీ ఆశ్రయించాడు. సమాచారం అందుకున్న ఎసిబి అధికారులు పక్కా ప్లానింగ్ తో కోదాడ బైపాస్ రోడ్డు లో వెంకన్న కు 20 వేల రూపాయలు ఇస్తుండగా ఏసీబీ వారు పట్టుబడి చేశారు.అనంతరం ఫారెస్ట్ కార్యాలయంలో సోదాలు నిర్వహించు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నాం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్ :** ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా.. ఎన్నికల హామీలను అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి, డిస్ట్రిక్ రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సిఎం రేవంత్ రెడ్డి శంకు స్థాపన చేశారు. శంకుస్థాపనకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలో పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని, 39 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నుంచి 62 శాతం ఆదాయం వస్తుందని తెలియజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇబ్బందులు ఉండకూడదనే అన్ని సదుపాయాలతో ఆఫీసులు నిర్మిస్తున్నామని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్ :** తెలంగాణలో మద్యం దుకాణాల ఆశావాహులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ల దరఖాస్తుకు ఆబ్కారీ శాఖ బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అలాగే, దరఖాస్తుల ఫీజు కూడా భారీగా పెంచేసింది. దరఖాస్తు పీజు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచినట్లు పేర్కొంది. వచ్చే రెండేండ్ల కాల పరిమితి (2025 డిసెంబర్ నుంచి 27 నవంబర్ వరకు)కి కి సంబంధించి లాటరీ పద్ధతి ద్వారా మద్యం దుకాణాల లైసెన్సులను ఎంపిక చేయనుంది. మద్యం దుకాణాల కేటాయింపులో గౌడ్‌లకు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించనుంది. మద్యం దుకాణాలకు 6 శ్లాబ్‌లలో ఎక్సైజ్‌శాఖ లైసెన్స్‌లు జారీ చేయనుంది.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**పెద్దపల్లి :** పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో స్థానిక ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణ వేణి సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 81 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సురేష్ గౌడ్, సయ్యద్ మసరత్, బొంకూరి అవినాష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ అతి చిన్న వయసులో ప్రధానమంత్రిగా పనిచేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. అలాగే 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించారని, యువత రాజకీయంగా ఎదగాలని పంచాయతీ సంస్కరణ చేసి ఎంతో మేలు చేశారన్నారు. భారతదేశం హక్కుగా మీద నిలిచిందని అలాగే ఇందిరా గాంధీ ఆశయాలను ముందుకు తీసుకుపోతూ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచారని దేశం కోసం ప్రాణాలు అర్పించిన గాంధీ కుటుంబమన్నారు. రానున్న రోజుల్లో రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకపోతూ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్లు నూగి ల్ల మల్లయ్య, భూత గడ్డ సంపత్, తూముల సుభాష్, పట్టణ ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డుపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పట్టణ ఉపాధ్యక్షులు నాంసాని శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాగాల శ్రీకాంత్, నెత్తెట్ల కుమార్ యాదవ్, తాడూరి శ్రీమాన్, ఫణింద్ర భూపతి, తిర్రి శ్రీనివాస్ గౌడ్, నదీమ్, మానుపాటి రవి, కాజా, సాయి తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం

**హైదరాబాద్ :** రాష్ట్రంలో యూరియా కొరతపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ చోట చెప్పులు లైన్లో పెడితే మరోచోట ఆధార్ కార్డులు ఇంకో చోట పట్టాదార్ పాస్‌బుక్కులు ఉంచుతున్నారని.. ఎండలేదు, వాన లేదు, తెలంగాణలో ఏ మూలకు పోయినా ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయని తెలిపారు.కోడికూయక ముందే రైతన్న ఎరువుల దుకాణం ముందు క్యూ కడుతున్నాడని తెలిపారు. ఒక్క బస్తా కోసం పడిగాపులు గాస్తున్నాడని పేర్కొన్నారు. పదేళ్లలో ఎన్నడన్నా చూసినమా ఇంతటి దైన్యం ఉందా అని ప్రశ్నించారు. తెలంగాణలో మళ్లీ "ఆనాటి రోజులు" తెచ్చింది అసమర్థ రేవంత్ సర్కారు అని మండిపడ్డారు.ముందుచూపు కరువై, అన్నదాతను అరిగోసలు పెడుతోందని విమర్శించారు.

# బిజినెస్

# ఐటీఆర్ గడువు మళ్లీ పొడిగింపు?

## లాభాల బాటలో దేశీయ సూచీలు




గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్త నెమ్మదించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు గత వారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు ఈ వారంలో మాత్రం లాభాల జోష్‌లో సాగుతున్నాయి. జీఎస్టీలో సంస్కరణలు, భారత్‌పై ఆంక్షల విషయంలో డొనాల్డ్ ట్రంప్ కాస్త నెమ్మదించడం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడంతో మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. అంతర్జాతీయంగా సానుకూలాంశాలు కూడా కలిసి రావడంతో సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా రెండో లాభాలను ఆర్జించాయి. సోమవారం ముగింపు (81, 273)తో పోల్చుకుంటే మంగళవారం ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఒక దశలో దాదాపు 500 పాయింట్లు లాభపడి 81,755 వద్ద ఇంట్రాడే గరిష్టానికి చేరుకుంది. చివరకు సెన్సెక్స్ 370 పాయింట్ల లాభంతో 81, 644 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 103 పాయింట్ల లాభంతో 24, 980 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో మదర్సన్, ఐఐఎఫ్ఎల్, పేటీఎమ్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్, బంధన్ బ్యాంక్ షేర్లు లాభాలను ఆర్జించాయి. భారత్ డైనమిక్స్, కల్యాణ్ జువెల్లర్స్, సోలార్ ఇండస్ట్రీస్, క్యామ్స్, రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాల బాటలో నడిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 551 పాయింట్లు లాభపడింది. బ్యాంక్ నిఫ్టీ 130 పాయింట్లు ఆర్జించింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 86.95గా ఉంది.

## భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం ఉండదు



భారత దీర్ఘకాలిక వృద్ధిపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉండకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్, అభిప్రాయపడింది. ఆర్థిక సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుండటం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. 'విదేశీ వాణిజ్యంపై భారత ఆర్థిక వ్యవస్థ పరిమితంగానే ఆధారపడుతోంది. జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా కేవలం 15 శాతమే కాగా... దేశీయ గిరాకీనే 85 శాతం వరకు ప్రభావం చూపుతోంది. అందుకే టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోద'ని ఎస్ అండ్ పీ ఆసియా పసిఫిక్ ఆర్థికవేత్త విస్తృత్ రాణా విశ్లేషించారు. అమెరికా విధించే 50 శాతం అధిక టారిఫ్‌లు భారత్ నుంచి ఎగుమతి అయ్యే అన్ని వస్తువులకూ వర్తించబోదనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలని అన్నారు. 'భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావాన్ని పరిమితం చేసేందుకు పలు అంశాలు దోహదం చేస్తాయి. స్వల్పకాలంలో కొంత ప్రభావమైతే ఉండొచ్చు. మౌలిక రంగంపై అధిక కేటాయింపులు, వ్యాపార అనుకూల పరిస్థితులు లాంటివి మధ్యకాలంలో దేశ వృద్ధి పథాన్ని నిర్దేశిస్తాయ'ని ఆయన వివరించారు. దీర్ఘకాలిక అంచనా ఆధారంగానే రేటింగ్స్‌ను నిర్ణయిస్తామని.. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ లాంటి రంగాలకు మినహాయింపు ఉంటుందని విశ్లేషించారు. 'భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా కేవలం ఒక్క శాతమే. అందువల్ల టారిఫ్‌లు అధికంగా ఉన్నా.. భారత దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై ఎటువంటి ప్రభావం ఉండద'ని ఆయన వివరించారు. జీఎస్టీ విధానంలో శ్లాబుల సంఖ్యను రెండింటికి తగ్గించాలనే ప్రతిపాదన వల్ల పన్ను రేట్లు దిగివస్తాయని.. దీర్ఘకాలంలో ఆదాయాలు పెరిగేందుకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.




ఆదాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేసేందుకు గడువు సమీపిస్తోంది. ఇంకో 25 రోజులు మాత్రమే ఉంది. అయితే, ఇప్పటికీ కొన్ని ఎక్సెల్ యుటిలిటీలను విడుదల చేయలేదని, ఇప్పటి వరకు అందుబాటులోకి తెచ్చిన ఐటీఆర్ ఫారాలు, ఎక్సెల్ యుటిలిటీలు ఆలస్యం కావడం ట్యాక్స్ పేయర్లపై ఒత్తిడి పెంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మందిపు సంవత్సరం 2025-26కు సంబంధించి ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్నులు ఫైల్ చేసేందుకు ప్రభుత్వం ఐటీఆర్ గడువును పొడిగించనుందా? అంటే తప్పనిసరిగా చేయాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ట్యాక్స్ పేయర్లు గడువు పెంచాలని కోరుతున్నారు. ఐటీఆర్ గడువు దగ్గరపడుతున్న క్రమంలో ట్యాక్స్ పేయర్లు, ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌లో ఆందోళన సైతం పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గుజరాత్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహా చాలా మంది పన్ను నిపుణులు ఐటీఆర్ ఫైలింగ్ డెడ్‌లైన్ మరోసారి పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు. సెప్టెంబర్ 15, 2025 వరకు ఉన్న గడువును పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ట్యాక్స్ పేయర్లు, ఛార్టర్డ్ అకౌంటెంట్లు ఇచ్చిన గడువులోపు ఐటీ రిటర్నులు ఫైల్ చేయడం అనేది సాధ్యం కాదంటున్నారు.ఈ క్రమంలోనే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ కి లేఖ రాసింది గుజరాత్ పారిశ్రామిక సంఘం జీసీసీఐ. ఐటీ రిటర్నుల గడువును మరోసారి పొడిగించాలని కోరింది. ఈసారి ట్యాక్స్ పేయర్లు, పన్ను నిపుణులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గుర్తు చేసింది. ప్రధానంగా ఈ ఏడాది ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఆలస్యంగా విడుదల చేయడమేనంటున్నారు. ఏప్రిల్ రెండో వారంలోపు రావాల్సిన ఐటీఆర్ యుటిలిటీలు, ఫారాలను ఏప్రిల్ చివరి నాటికి కొన్నింటిని మాత్రమే రిలీజ్ చేసింది. ఇప్పటికీ చాలా ఫారాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఐటీఆర్- 5 యుటిలిటీ ఆగస్టు 8, 2025 తేదీన విడుదల చేశారు. దీంతో ఐటీఆర్ దాఖలు చేసేందుకు సిద్ధమయ్యేందుకు తక్కువ సమయం ఇచ్చినట్లయింది. ఇక సిస్టమ్ ఎర్రర్స్, లాగిన్ ఫెయిల్యూర్స్, టైమ్ ఔట్స్ వంటివి ఐటీఆర్ అప్లోడ్ చేస్తున్న సమయంలో ఎదురవుతున్న సమస్యలుగా జీసీసీఐ సూచించింది. అలాగే ట్యాక్స్ పోర్టల్‌లో ఆడిట్ రిపోర్ట్స్ సైతం ఉండడం లేదని తెలిపింది. అలాగే ఫారం 26 ఏఎస్, ఏఐఎస్, టీఐఎస్ వంటి వాటిల్లోని వివరాల్లో తేడాలు ఉండడమూ ఇబ్బందులు కలిగిస్తున్నట్లు తెలిపింది. ఆగస్టు నుంచి నవంబర్ వరకు పలు పండగలు వస్తున్నాయి. ఇది ట్యాక్స్ ప్రొఫెషనల్స్ పనిపై ప్రతికూల ప్రభావం చూపిస్తుందంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సెప్టెంబర్ 15లోపు ఐటీ రిటర్నుల ఫైలింగ్ పూర్తి కాదని, మరింత సమయం ఇవ్వాలని కోరుతున్నారు.

## తగ్గినా పసిడి ధరలు



ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం ఇందుకు ఒక ప్రధాన కారణంగా చెప్పవచ్చు.ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ మధ్య జరిగిన వాణిజ్య చర్చల అనంతరం ఎలాంటి ప్రతికూల పరిణామాలు లేకపోవడం కూడా ధరల స్థిరత్వానికి దారితీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో, ఆగస్టు 19, సోమవారం నాడు బంగారం ధరలు తగ్గాయి. ఈ రోజు 24 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 44 తగ్గింది. ప్రస్తుతం ఒక గ్రాము బంగారం ధర రూ. 10,075 కాగా, 100 గ్రాముల ధర రూ. 10,07,500గా ఉంది. అలాగే, 22 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 9,235గా, 18 క్యారట్ల బంగారం గ్రాము ధర రూ. 7,556గా నమోదైంది. వివిధ భారతీయ నగరాల్లోనూ బంగారం ధరలు దాదాపుగా ఒకే విధంగా ఉన్నాయి. హైదరాబాద్, (%ఫ్రఎవతీఖుఝు%) విజయవాడ, చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో 24 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,00,750 వద్ద ఉంది. అదేవిధంగా, ఈ నగరాల్లో 22 క్యారట్ల 10 గ్రాముల ధర రూ. 92,350గా ట్రేడ్ అవుతోంది. ఢిల్లీ మరియు అహ్మదాబాద్ నగరాల్లో మాత్రం ధరలు కొద్దిగా ఎక్కువగా ఉన్నాయి. ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,900 కాగా, 22 క్యారట్ల ధర రూ. 92,500గా ఉంది. అహ్మదాబాద్‌లో 24 క్యారట్ల బంగారం ధర రూ. 1,00,800 మరియు 22 క్యారట్ల ధర రూ. 92,400గా నమోదైంది. రాబోయే పండుగ సీజన్ దృష్ట్యా, ఆర్థిక నిపుణులు బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ, పెట్టుబడిదారులు బంగారంపై పెట్టుబడులను తగ్గించడం వల్ల ధరలు తగ్గుతున్నాయి. అలాగే, అమెరికా మరియు రష్యా మధ్య జరిగిన వాణిజ్య చర్చల తర్వాత ఎలాంటి ప్రతికూల పరిస్థితులు తలెత్తకపోవడం కూడా ఒక కారణం.

## ఎయిర్టెల్ యూజర్లకు షాకింగ్ న్యూస్

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తమ వినియోగదారులకు షాక్ ఇచ్చింది. గతంలో బాగా ప్రాచుర్యం పొందిన రూ. 249 ప్రీపెయిడ్ ప్లాన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ఇవాళ అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తుందని ఎయిర్‌టెల్ థాంక్స్ యాప్, వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఈ ప్లాన్ కింద వినియోగదారులకు 28 రోజుల పాటు అన్‌లిమిటెడ్ కాల్స్ మరియు రోజుకు 1+దీ డేటా లభించేది. తక్కువ డేటా అవసరం ఉన్న వినియోగదారులకు ఇది ఒక ఉత్తమ ఎంపికగా ఉండేది. ఈ నిర్ణయంతో ఎయిర్‌టెల్, ఇప్పటికే ఈ ప్లాన్‌ను రద్దు చేసిన జియో బాటలోనే పయనించినట్లు స్పష్టమవుతోంది. ఇటీవల జియో కూడా తమ వినియోగదారులకు అందిస్తున్న రూ. 249 ప్లాన్‌ను రద్దు చేసింది. ఇప్పుడు ఎయిర్‌టెల్ కూడా అదే నిర్ణయం తీసుకోవడంతో, రోజుకు 1+దీ డేటా ప్లాన్‌ల లభ్యత తగ్గిపోయింది. ఈ పరిణామం టెలికాం రంగంలో ధరలు పెరగడానికి దారితీస్తుందని నిపుణులు భావిస్తున్నారు. జియో మరియు ఎయిర్‌టెల్ తర్వాత, వొడాఫోన్ ఐడియా కూడా ఈ ప్లాన్‌ను రద్దు చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

# ఆస్ట్రేలియా గడ్డ మీద చరిత్ర సృష్టించిన కేశవ్ మహరాజ్

ఆస్ట్రేలియాతో తొలి వన్డే సందర్భంగా సౌతాఫ్రికా బౌలర్ కేశవ్ మహరాజ్ అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మార్నస్ లబుషేన్ రూపంలో తొలి వికెట్ అందుకుని.. సౌతాఫ్రికా తరఫున 300 వికెట్లు పూర్తి చేసుకున్నాడు. కైర్న్స్ వేదికగా మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కేశవ్ మహరాజ్ ఐదు వికెట్లతో చెలరేగి.. ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుదేలు చేశాడు. లబుషేన్ (1)తో పాటు.. కామెరాన్ గ్రీన్ (3), జోష్ ఇంగ్లిస్ (5), అలెక్స్ క్యారీ (0) రూపంలో నలుగురు కీలక బ్యాటర్లను అవుట్ చేశాడు.

### సరికొత్త చరిత్ర

ఇక ఎడంచేతి వాటం స్పిన్నర్ అయిన కేశవ్ మహరాజ్ (5/33) తన వన్డే కెరీర్‌లో ఈ మేర తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు. ఈ క్రమంలో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా గడ్డ మీద ఈ ఘనత సాధించిన సౌతాఫ్రికా తొలి స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్ చరిత్రపుటల్లో తన పేరు లిఖించుకున్నాడు.

### దిగ్గజాల సరసన

కాగా అంతకుముందు పేసర్లు మఖయా ఎంతిని (6), లుంగి ఎంగిడి (6).. లాన్స్ క్లుసేనర్, షాన్ పొలాక్, మార్కో యాన్సెన్, మోర్నీ మోర్కెల్, నిక్కీ బోజే, రిచర్డ్ స్నెల్ తదితరులు ఆస్ట్రేలియా గడ్డపై ఈ ఫీట్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా టీ20 సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా జట్టు వన్డే సిరీస్‌లో గెలుపు బోణీ కొట్టిన విషయం తెలిసిందే. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 98 పరుగుల తేడాతో గెలిచి 1%-%0తో ముందంజ వేసింది. కేశవ్ మహరాజ్ దక్షిణాఫ్రికా విజయంలో కీలకపాత్ర పోషించి.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కించుకున్నాడు.




### ప్రతీకారం తీర్చుకున్న సౌతాఫ్రికా

కాగా.. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ అనంతరం కంగారూ, సఫారీ జట్ల మధ్య ఇదే తొలి వన్డే కాగా... ఆ మ్యాచ్‌లో ఓడిన దక్షిణాఫ్రికా జట్టు... ఇప్పుడు విజయంతో బదులు తీర్చుకుంది. చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఈ క్రమంలో తాజాగా మంగళవారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 296 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (81 బంతుల్లో 82బీ 9 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... కెప్టెన్ తెంబా బవుమా (74 బంతుల్లో 65బీ 5 ఫోర్లు), మాథ్యూ బ్రీట్జ్కె (56 బంతుల్లో 57బీ 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకాలు సాధించారు. రికెల్టన్ (33బీ 3 ఫోర్లు), ముల్డర్ (26 బంతుల్లో 31 నాటౌట్‌బీ 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో ట్రావిస్ హెడ్ 9 ఓవర్లు వేసి 57 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు.

### కుదేలైన ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్

అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. 40.5 ఓవర్లలో 198 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (96 బంతుల్లో 88బీ 10 ఫోర్లు) మినహా టాపార్డర్ విఫలమైంది. లబుషేన్ (1), కామెరూన్ గ్రీన్ (3), జోష్ ఇన్‌గ్లిస్ (5), అలెక్స్ కేరీ (0), ఆరోన్ హార్డీ (4) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. తొలి వికెట్‌కు హెడ్ (24 బంతుల్లో 27బీ 6 ఫోర్లు)తో కలిసి 60 పరుగులు జోడించిన మార్ష్... ఏడో వికెట్‌కు ద్వార్‌షుయ్ (52 బంతుల్లో 33బీ 3 ఫోర్లు)తో కలిసి 71 పరుగులు జోడించాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కేశవ్ మహరాజ్ (5/33) మాయాజాలానికి ఆసీస్ టాపార్డర్ పెవిలియన్‌కు వరుస కట్టింది. వన్డేల్లో తొలిసారి ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన కేశవ్ వరుసగా... లబుషేన్, గ్రీన్, ఇన్‌గ్లిస్, కేరీ, హార్డీ వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. దీంతో ఒక దశలో 60/0తో పటిష్ట స్థితిలో ఉన్న ఆసీస్ జట్టు... 29 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు కోల్పోయి 89/6తో నిలిచింది. మార్ష్ పోరాడినా ఫలితం లేకపోయింది.

## ప్రపంచ నంబర్ వన్ బౌలర్‌గా అవతరించిన కేశవ్ మహారాజ్




ఐసీసీ ఇవాళ (ఆగస్ట్ 20) ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో ఓ ప్రధాన మార్పు చోటు చేసుకుంది. బౌలర్ల విభాగంలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ నంబర్ వన్ స్థానానికి ఎగబాకాడు. నిన్న ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో సంచలన ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన మహారాజ్.. రెండు స్థానాలు మెరుగుపర్చుకుని అగ్రస్థానానికి చేరాడు. ఈ క్రమంలో శ్రీలంక స్పిన్నర్ మహీశ్ తీక్షణ, టీమిండియా చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌ను రెండు, మూడు స్థానాలకు నెట్టాడు. టీమిండియా నుంచి కుల్దీప్‌తో పాటు రవీంద్ర జడేజా టాప్-10లో(తొమ్మిదో స్థానం) ఉన్నాడు. భారత పేస్ త్రయం షమీ, బుమ్రా, సిరాజ్ వరుసగా 13, 14, 15 స్థానాల్లో ఉన్నారు. బ్యాటర్ల విభాగంలో టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నంబర్ స్థానంలో కొనసాగుతుండగా.. బాబర్ ఆజమ్, డారిల్ మిచెల్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు. భారత్ నుంచి గిల్‌తో పాటు శ్రేయస్ అయ్యర్ (6) టాప్ 10లో ఉన్నాడు. ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పేర్లు కనిపించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. గత వారం ర్యాంకింగ్స్‌లో రోహిత్ రెండు.. విరాట్ నాలుగు స్థానాల్లో ఉన్నారు. ఆకస్మికంగా వారి పేర్లు ర్యాంకింగ్స్ నుంచి మాయమైపోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఆల్‌రౌండర్ల విభాగానికొస్తే.. ఆఫ్ఘనిస్తాన్ ఆటగాళ్లు అజ్మతుల్లా ఒమర్‌జాయ్, మొహమ్మద్ నబీ టాప్-2లో కొనసాగుతుం డగా.. భారత్ నుంచి రవీంద్ర జడేజా ఒక్కడే టాప్ 10లో (పదో స్థానం) ఉన్నాడు.

### మహారాజ్ మాయాజాలం


మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియాతో నిన్న జరిగిన తొలి వన్డేలో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ అద్భుతమైన మాయాజాలాన్ని ప్రదర్శించాడు. 297 పరుగుల భారీ లక్ష్యాన్ని డిఫెండ్ చేసుకునే క్రమంలో 5 వికెట్ల ప్రదర్శనతో చెలరేగాడు. ఫలితంగా ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా ఆస్ట్రేలియాను 98 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ ప్రదర్శనతో మహారాజ్ పలు రికార్డులను కొల్లగొట్టాడు. తాజాగా ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన్ని దక్కించుకున్నాడు.

# స్పోర్ట్స్

## ఆసియా కప్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దక్కని చోటు.. అసంతృప్తిని వ్యక్తం చేసిన అభిషేక్ నాయర్




వచ్చే నెలలో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం బీసీసీఐ జట్టును ప్రకటించింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులో చోటు కల్పించకపోవడంపై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఛాంపియన్స్ ట్రోఫీలో సత్తా చాటిన, ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించిన అయ్యర్‌కు 15 మంది సభ్యుల జట్టులోనే కాకుండా, ఐదుగురు స్టాండ్‌బై ఆటగాళ్ల జాబితాలో కూడా చోటు దక్కలేదు. దాంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే బీసీసీఐ నిర్ణయంపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'శ్రేయస్ అయ్యర్ లాంటి స్టార్ ఆటగాడు కనీసం రిజర్వ్ ఆటగాళ్ల జాబితాలో కూడా ఎలా లేడో నాకు అర్థం కావడం లేదు. అతడిని 20 మందితో కూడిన జట్టులో ఎందుకు తీసుకోలేదో తెలియడం లేదు. ఈ నిర్ణయం అతనికి జట్టులో ప్రాధాన్యత ఇవ్వడం లేదు అనే స్పష్టమైన సంకేతం ఇస్తుంది' అని పేర్కొన్నాడు. సెలక్షన్ అనేది కేవలం ఆటగాడి ప్రతిభను మాత్రమే కాకుండా, కొంతమంది వ్యక్తుల ఇష్టాలకు ఆధారపడి ఉండవచ్చని నాయర్ వ్యాఖ్యానించాడు. అయితే, జట్టులో చోటు కల్పించకపోవడంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ స్పందించారు. 'శ్రేయస్ తప్పేమీ లేదు. తాము కేవలం 15 మందిని మాత్రమే ఎంపిక చేయగలం. ప్రస్తుతానికి అతను తన అవకాశం కోసం ఎదురు చూడాల్సిందే' అని కామెంట్ చేశాడు. అలాగే, అభిషేక్ శర్మ బౌలింగ్ చేయగల సామర్థ్యం ఉన్న ఆటగాడు కావడంతో యశస్వి జైస్వాల్ వంటి ఆటగాడిని పక్కన పెట్టడం అనివార్యమైందని అగార్కర్ చెప్పుకొచ్చాడు. ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 17 మ్యాచ్‌లలో 175.07 స్ట్రయిక్ రేట్‌తో 604 పరుగులు చేసి, అత్యధిక స్కోరర్ చేసిన ఆరో ప్లేయర్‌గా నిలిచాడు. ఫుల్ ఫామ్‌లో ఉన్న ఆటగాడిని కీలకమైన టోర్నమెంట్‌కు ఎంపిక చేయకపోవడంపై క్రీడా వర్గాల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## ప్రభాస్ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఊహించలేదు

టాలీవుడ్‌లో ప్రభాస్ తొలి సినిమా ఈశ్వర్‌లో మెప్పించిన కోలీవుడ్ ముద్దుగుమ్మ శ్రీదేవి విజయ్ కుమార్. అంతకుముందే తమిళంలో చాలా చిత్రాలు చేసిన శ్రీదేవి.. రుక్మిణి మూవీతో తెలుగులో అడుగుపెట్టింది. టాలీవుడ్‌లోనూ చాలా సినిమాల్లో తనదైన నటనతో మెప్పించింది. తెలుగులో చివరిసారిగా వీర చిత్రంలో కనిపించిన శ్రీదేవి.. చాలా ఏళ్ల తర్వాత రీ ఎంట్రీ ఇస్తోంది. నారా రోహిత్ హీరోగా వస్తోన్న సుందరకాండ మూవీలో కనిపించనుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన శ్రీదేవి విజయ్ కుమార్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. ప్రభాస్ కెరీర్‌లోనే బెస్ట్ సినిమాల్లో ఒకటని.. తొలి సినిమాతోనే మాస్ హీరోగా మెప్పించారని అన్నారు. ఆ సినిమా సమయంలోనే ప్రభాస్ స్టార్ అవుతాడని మేము అనుకున్నామని తెలిపింది. కానీ ఈ రేంజ్‌కు వెళ్తాడని ఎవరు కూడా ఊహించలేదని శ్రీదేవి వెల్లడించింది. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి అని.. ఒకరికి చెడు జరగాలని అస్సలు అనుకోరని అన్నారు. ఆయనది చిన్నపిల్లాడి మనస్తత్వమని శ్రీదేవి పేర్కొంది. కాగా. సుందరకాండ చిత్రాన్ని వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో శ్రీదేవి కీలక పాత్రలో కనిపించనుంది. ఈ చిత్రంలో వృతి వాఘాని హీరోయిన్‌గా నటించారు. సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది.




## ఎస్ఎస్ఎంబీ 29 కోసం ఎస్ఎస్ రాజమౌళి కొత్త ప్రయోగం.. జంగిల్ సఫారీ రైడ్ అందుకేనా..?

గ్లోబల్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి సినిమా అంటే విజువల్స్ ఎలా ఉంటాయో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. జక్కన్న వీఎఫ్ఎక్స్ పార్ట్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉంటుంది. అందుకు మగధీర, ఈగ, బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలే ఉత్తమ ఉదాహరణగా చెప్పొచ్చు. అందుకే భారతీయ సినీ చరిత్రలో జక్కన్న సినిమాలు చాలా ప్రత్యేకమైనవిగా నిలిచాయి. కాగా ఇప్పుడిక ఎస్ఎస్ఎంబీ 29 సినిమాతో బిజీగా ఉన్నాడు ఎస్ఎస్ రాజమౌళి. మహేశ్ బాబు లీడ్ రోల్‌లో నటిస్తోన్న ఈ మూవీ ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతుంది. భారత్‌లో కొన్ని కీలక షెడ్యూల్స్ షూట్ చేసిన జక్కన్న టీం నెక్ట్స్ షెడ్యూల్ కోసం ప్రస్తుతం నైరోబిలో ల్యాండ్ అయింది. ఇప్పటికే మూవీ హీరోయిన్ ప్రియాంకా చోప్రా ప్రైడ్ ల్యాండ్స్ (సింహాలకు ఆవాసమైన సవన్నా భూభాగం)లో సఫారీ రైడ్ చేసి హైనా, హిప్పోపొటామస్, ఆస్ట్రిచ్, ఆఫ్రికన్ బఫెలో లాంటి వాటిని కెమెరాలో బంధించి ఆ ఫొటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసింది. ఇక ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు, మూవీ లవర్స్ సినిమా గురించి ఆసక్తికర చర్చ తెరపైకి తెచ్చారు. ఇంతకీ విషయమేంటంటే ఈ సినిమా కోసం జక్కన్న సీజీ వర్క్‌కు బదులు కొత్త మెథడ్‌ను ఫాలో అవుతున్నాడని చర్చించుకుంటున్నారు. సినిమాలోని సన్నివేశాలను రియలిస్టిక్‌గా చూపించి అభిమానులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లేందుకు జక్కన్న టీం నైరోబీలోని జంగిల్‌లో సఫారీ రైడ్ చేస్తూ ఇలా జంతువులను షూట్ చేస్తున్నారని అంటున్నారు. సెరెంగెటి నేషనల్ పార్క్ టాంజానియాతోపాటు ఇతర లొకేషన్లలో నెక్ట్స్ షెడ్యూల్ కొనసాగనుంది. అంటే సీజీకి బదులు కెమెరాతో తీసిన రియలిస్టిక్ సీన్లను సినిమాలో చూపించనున్నాడన్నమాట. మేకర్స్ ముందుగా చెప్పినట్టుగానే ఈ చిత్రం అద్భుతమైన గ్లోబల్ యాక్షన్ అడ్వెంచరస్ డ్రామా కాబోతుందని తాజా వార్తలు మరోసారి హింట్ ఇచ్చేస్తున్నాయి. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నాడు. మరి రాబోయే రోజుల్లో ఎస్ఎస్ రాజమౌళి టీం నుంచి ఏదైనా అధికారిక అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.



## జయ్ దేవరకొండ కింగ్‌డమ్.. మాస్ సాంగ్ వచ్చేసింది!

విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ కింగ్‌డమ్. గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ మూవీలో భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా మెప్పించింది. జూలై 31న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం నాలుగు రోజుల్లోనే రూ.80 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ నుంచి సూపర్ హిట్ సాంగ్ మేకర్స్ రిలీజ్ చేశారు. రగిలే రగిలే అంటూ సాగే మాస్ సాంగ్ ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ పాట విజయ్ ఫ్యాన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. ఈ పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతమందించారు. కాగా.. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.



## ట్విస్ట్‌తో ఓటీటీలోకి పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు.. ఇంతకీ ఏం మార్పులు చేశారో తెలుసా..?

టాలీవుడ్ యాక్టర్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ పోషించిన చిత్రం హరిహరవీరమల్లు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా హరిహరవీరమల్లు పార్ట్-1 జులై 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. అయితే భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద అభిమానులను నిరాశపరిచింది. సినిమాలో వచ్చే కొన్ని సన్నివేశాలపై భారీ ఎత్తున ట్రోల్స్ వెల్లువెత్తాయి. కాగా థియేటర్లలో అంతగా ఇంప్రెస్ చేయలేకపోయిన ఈ చిత్రం ఓటీటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. కేవలం నాలుగు వారాల వ్యవధిలోనే ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది హరిహరవీరమల్లు. ఈ మూవీ ప్రస్తుతం పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. కాగా పలు మార్పులతో ఓటీటీ వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు మేకర్స్. ఓటీటీ మూవీ లవర్స్ కోసం కొన్ని సన్నివేశాలను ట్రిమ్ చేశారు. వీఎఫ్ఎక్స్ హార్స్ రైడింగ్ సెకండాఫ్‌లో పవన్ కల్యాణ్ విల్లు ఎక్కుపెట్టే సన్నివేశాలపై ప్రేక్షకులు, అభిమానుల పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చిన విషయం తెలిసిందే. తుఫాను వచ్చే సమయంలో వారి మధ్య జరిగే ఘర్షణకు సంబంధించిన సీన్లను తీసివేశారట. ఓటీటీ వెర్షన్‌లో ఈ సన్నివేశాలను పూర్తిగా తొలిగించారని ఇన్‌సైడ్ టాక్. కొత్త వెర్షన్ ప్రకారం అసుర హననం పాట తర్వాత పార్ట్ 2 అనౌన్స్‌మెంట్‌తో సినిమా ముగియనుంది. బాబీ డియోల్‌తో ఎదురుపడే సన్నివేశాలు, సైక్లోన్ ఫైట్ సహా 15 నిమిషాలు ఓటీటీ వెర్షన్‌లో తీసేశారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. ఈ కట్స్ తీసేయగా ప్రస్తుతం హరిహరవీరమల్లు ఓటీటీ రన్‌టైం 2 గంటల 33 నిమిషాలన్నమాట. మరి ఓటీటీలో ఎలాంటి ఇంప్రెషన్ కొట్టేస్తుందో చూడాలి. పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించాడు. ఈ మూవీని ఏఎం రత్నం సమర్పణలో మేఘ సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఏ దయాకర్‌రావు నిర్మించారు.



Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108